



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY



ఈ స్థలం [22 సెంట్లు]

**అమ్మబడును**

భూమి ప్లాట్ నిర్వహణ - అమ్మకం, అద్దె, కొనుగోలు లేదా పెట్టుబడి కోసం నివాస ప్రాంతంలో భవన నిర్మాణం మరియు గృహ ఉపవిభాగానికి అందుబాటులో ఉన్న ఖాళీ పొడి నేల భూమి ప్లాట్‌తో రియల్ ఎస్టేట్ భావన.




సంప్రదించవలసిన నెంబర్లు

కె. అబెడ్నేగో(రాజు బాబు ) : 9985998066
సిహెచ్. సురేష్ : 9959996243

RAYAVARAM MANDAL, RAYAVARAM VILLAGE, EGDT : 533346



SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 187 | తూర్పుగోదావరి జిల్లా | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | సోమవారం 30 మార్చి 2026 | పేజీలు : 12 | వెల : 2/-







## పార్టీ కోసం పనిచేసే వారికి
# ప్రజాప్రతినిధులుగా అవకాశం

- కార్యకర్తలను దూరంగా ఉంచే నేతలను నేను దూరంగా ఉంచుతా
- కార్యకర్తలకు ఆర్థిక సాధికారత కల్పించే బాధ్యత నాది
- పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు ప్రతీ అడుగూ సంచలనమే...
- టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- కొత్తలుక్‌తో టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవం
- వేదికపైన కార్యకర్తలు... వేదిక కింద నేతలు
- కార్యకర్తే అధినేత అనే నినాదానికి అద్దం పట్టేలా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** పార్టీ కోసం పని చేసే వాళ్లకే పదవులు ఇస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అంతే కాకుండా... పార్టీ బలోపేతానికి కృషి చేసిన వాళ్లకు ప్రజా ప్రతినిధులుగా అవకాశం ఇస్తామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవాల సందర్భంగా ఆదివారం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన సభలో ముఖ్యమంత్రి కొన్ని ముఖ్యమైన అంశాలు ప్రస్తావించారు. ఓ వైపు 50 శాతం సీట్లు పెరిగేలా డి-లిమిటేషన్ ప్రక్రియ వేగవంతం కానుండడం, మరోవైపు మహిళా రిజర్వేషన్లు అమలు కాబోతున్న క్రమంలో సీఎం చంద్రబాబు మిగతా .. 2లో..

### అమరావతికి
# చట్టబద్ధత..
### అమిత్‌షాతో మాట్లాడిన వెంకయ్య నాయుడు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్ట బద్ధత కల్పించే అంశంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు మాట్లాడారు. ఏపీ అసెంబ్లీ తీర్మానం చేసిన బిల్లును ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే ప్రవేశపెట్టి ఆమోదించాలని కోరారు. 2015 అక్టోబర్ 22న ప్రధాని మోదీ, అప్పటి పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్న తన చేతులమీదుగా మిగతా .. 2లో..

# తెలుగుజాతి కోసం జన్మించిన పార్టీ తెలుగుదేశం

**కార్యకర్తలే టీడీపీ బలం, బలగం - దేశానికి సంక్షేమాన్ని పరిచయం చేసింది అన్న ఎన్టీఆర్**
**దేశానికి అభివృద్ధిని పరిచయం చేసింది మన బ్రాండ్ సీబీఎన్**
**జగన్ రెడ్డి క్రెడిట్ చోరీ డిజార్డర్ తో బాధపడుతున్నారు - పార్టీ కేడర్‌కు ఉచితంగా హెల్త్ చెకప్ చేయిస్తాం**
**పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో మంత్రి లోకేష్**



**మంగళగిరి, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుజాతి కోసం జన్మించిన పార్టీ తెలుగుదేశం అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో కలిసి మంత్రి లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి మిగతా .. 2లో..

# పార్టీకి కార్యకర్తలే బలం

**ఎన్టీ రామారావు యుగపురుషుడు - ఎన్టీఆర్ రాజకీయాల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారు**
**గత ప్రభుత్వంలో కార్యకర్తలు పోరాటం చేశారు**
**సీఎం చంద్రబాబు నాయకత్వంలో టీడీపీ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోంది**
**నారా లోకేష్ కార్యకర్తల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తున్నారు..హోం మంత్రి అనిత**
**పాయకరావుపేట నియోజకవర్గంలో ఘనంగా టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు**

**నక్కపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం బోదిగల్లం గ్రామంలో తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హోం మంత్రి వంగలపూడి అనిత టీడీపీ జెండాను ఆవిష్కరించి, ఎన్టీ రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాయకరావుపేట నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులు, మిగతా .. 2లో..




### ఉచిత ల్యాప్‌టాప్‌లు..
# మహిళలకు రూ.8 వేల కూపన్లు
### డీఎంకే మేనిఫెస్టో



**విశ్వం వాయిస్ న్యూస్ :** తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రధాన పార్టీలు ఎన్నికల హామీలను విడుదల చేసే పనిలో నిమగ్నమయ్యాయి. తాజా డీఎంకే కూడా ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి వరకు అల్పాహార పథకాన్ని కొనసాగించడంతోపాటు మహిళలకు అందించే ఆర్థిక సాయాన్ని రూ.2వేలకు పెంచుతామని ప్రకటించింది. రైతులకు ఉచితంగా మీటరులేని అధునాతన పంపుసెట్లు, యువతకు ఉచిత ల్యాప్‌టాప్‌లు, ఆరోగ్య బీమా రూ.10 లక్షల వరకు పెంపు, ఐదేళ్లలో 10 లక్షల ఇళ్లు మిగతా .. 2లో..

### టీమ్ ఇండియాను చూసి
# మనం గర్వించాలి : ప్రధాని మోదీ



**విశ్వం వాయిస్ న్యూస్ :** టీమ్ ఇండియాను చూసి ప్రజలు గర్వించాలని ప్రధాని మోదీ పేర్కొన్నారు. 132వ మన్‌కీ బాత్ ఎపిసోడ్‌లో భారత పురుషుల క్రికెట్ జట్టును ప్రశంసించారు. భారత్ ప్రపంచకప్‌ను అందుకున్న వేళ భారత్ మొత్తం సంతోషం వెల్లువెత్తిందన్నారు. వివిధ పోటీల్లో భారత క్రీడాకారులు సాధించిన విజయాలను ప్రధాని ప్రస్తావించారు. లాంగ్ డిస్టెన్స్ రన్నర్ గుల్వీర్ సింగ్ న్యూయార్క్ హాఫ్ మారథాన్ రన్నింగ్‌లో మూడో స్థానంలో నిలవడాన్ని ఆయన అభినందించారు. ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన గుల్వీర్ చరిత్ర సృష్టించాడని ప్రధాని మిగతా .. 2లో..

# టీవీకే అభ్యర్థుల జాబితా విడుదల..
### రెండుచోట్ల నుంచి విజయ్ పోటీ



**విశ్వం వాయిస్ న్యూస్ :** తమిళనాడులో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. టీవీకే అభ్యర్థుల జాబితాను పార్టీ అధ్యక్షుడు విజయ్ ప్రకటించారు. విజయ్ రెండు చోట్ల నుంచి పోటీ చేస్తున్నారు. పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ నుంచి ఆయన బరిలోకి దిగుతున్నారు. చెన్నైలో జరిగిన సభలో విజయ్ ఈ జాబితాను విడుదల చేశారు. తన అభ్యర్థులను ప్రజల రక్షకులుగా అభివర్ణించారు. వారు రాజకీయ దిగ్గజాలు కాదని, ప్రజలకు జవాబుదారీగా ఉంటారని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో తమకు, సీఎం నేతృత్వంలోని మిగతా .. 2లో..

### 'తల్లిదండ్రుల సంరక్షణ' బిల్లుకు
# తెలంగాణ శాసనసభ ఆమోదం



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** 'తల్లిదండ్రుల సంరక్షణ ఉద్యోగుల బాధ్యత' బిల్లుకు తెలంగాణ శాసనసభ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ... పిల్లల కోసం తల్లిదండ్రులు తమ శక్తినంతా ధారపోస్తారని, పిల్లలు మాత్రం రెక్కలు వచ్చాక తల్లిదండ్రుల్ని పట్టించుకోవట్లేదని చెప్పారు. వృద్ధ తల్లిదండ్రులకు అండగా నిలవాలనే ఈ చట్టం తీసుకొచ్చినట్లు సభలో వెల్లడించారు. "వృద్ధుల కోసం కేంద్రం 2007లో ఒక చట్టం తెచ్చింది. కేంద్ర చట్టం ప్రకారం తల్లిదండ్రులకు రూ.10 వేలకు మించి ఇచ్చే మిగతా .. 2లో..

### తెలుగు జాతి ఆత్మగౌరవానికి
# ప్రతీక తెలుగుదేశం పార్టీ



**టెక్కలిలో ఘనంగా తెదేపా 44వ ఆవిర్భావ దినోత్సవం**
**జెండా ఎగురవేసిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**శ్రీకాకుళం, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగు జాతి ఆత్మగౌరవం కోసం ఆవిర్భవించిన మహత్తర రాజకీయ శక్తి తెలుగుదేశం పార్టీ అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. కోటబొమ్మాళి పార్టీ కార్యాలయంలో జరిగిన 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై పార్టీ జెండాను ఘనంగా ఎగురవేశారు. ఈ సందర్భంగా స్వర్గీయ నందమూరి తారకరామారావు, కింజరాపు ఎర్రన్నాయుడు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మిగతా .. 2లో..

# మళ్లీ మళ్లీ కూటమి ప్రభుత్వమే రావాలి

**అన్న ఎన్టీఆర్ ఆశయ సాధనే సీఎం చంద్రబాబు మంత్రి లోకేశ్ లక్ష్యం**
**టీడీపీకి కార్యకర్తలే వెన్నుముక.. - కూటమి నాయకులను కలుపుకుపోవాలి**
**టీడీపీ ఆవిర్భావ దినోత్సవ సభలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**



**పెనుకొండ/శ్రీసత్యసాయి, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే వెన్నుముక అని, పసుపు జెండా మోసిన వారిని పార్టీ అధిష్టానం ఎప్పుడూ ప్రాధాన్యమిస్తూనే ఉంటుందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. మళ్లీ మళ్లీ కూటమి ప్రభుత్వాలే రాష్ట్రంలో వచ్చేలా కార్యకర్తలందరూ పనిచేయాలని, కూటమిలోని ఇతర పార్టీలతో కలుపుకుపోవాలని పిలుపునిచ్చారు. దోపిడి, మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# ప్రజా ప్రతినిధులుగా అవకాశం

ఆవిర్భావ దినోత్సవం నాడు కీలక కామెంట్లు చేశారు. అలాగే కార్యకర్తలను పట్టించుకోని నేతలు తనకు అక్కర్లేదంటూ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..." ఈ సారి 50 శాతం సీట్లు పెరగనున్నాయి. 33 శాతం మహిళలకు రిజర్వేషన్లు అమలు కాబోతున్నాయి. పార్టీ కోసం ఎవరు బాగా పని చేస్తే వారే ప్రజాప్రతినిధులవుతారు. క్రమశిక్షణతో పని చేయండి... పార్టీని బలోపేతం చేయండి.. కష్టపడే కార్యకర్తలను, నేతలను గుర్తించే బాధ్యత లోకేష్ దే. తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులు అందరికీ ఆదర్శంగా ఉండాలి. వ్యక్తిగత ప్రవర్తన మొదలుకుని ప్రతి అంశంలో తెలుగుదేశం బ్రాండ్ నిలిపేలా వ్యవహరించాలి. ప్రజలతో మమేకం కావాలి... సమస్యలు పరిష్కరించాలి. అభివృద్ధి వైకుంఠపాళి కాకూడదు. తెలుగుదేశం పార్టీ బలంగా ఉంటేనే... రాష్ట్రం బలంగా ఉంటుంది. పార్టీ గెలుపే రాష్ట్రం గెలుపు. పసుపు జెండా నిరంతరం ఎగరాలి....రాష్ట్రం ఎప్పుడూ గెలవాలి. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ తెలుగు దేశం పుట్టుక నుంచి నేటి వరకు...మన సిద్ధాంతాలు, విజయాలు, ప్రయాణం...అన్నీ సంచలనమే. నాడు కేంద్రంలో ఉన్న ఇందిర ప్రభుత్వం ఒత్తిడితో రాష్ట్రంలోని ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేస్తే... ప్రజలే రోడ్డెక్కి ఉద్యమించారు. ఇదొక రికార్డు. టీడీపీ ప్రభుత్వాలు ఏపీలో సంక్షేమానికి నాంది పలికాయి. అభివృద్ధికి బాటలు వేశాయి. 40 ఏళ్ల క్రితం టీడీపీ తెచ్చిన రూ.2కే కిలో బియ్యం జాతీయ ఆహార భద్రతా పథకమైంది. అప్పుడు తెచ్చిన మహిళలకు ఆస్తి హక్కు తరువాత కేంద్రం చట్టం చేసింది. మహిళలకు నాడు స్థానిక ఎన్నికల్లో కల్పించిన రిజర్వేషన్... దశాబ్దాల తరువాత 33 శాతం రిజర్వేషన్‌కు అడుగులు పడడానికి కారణం అయ్యింది. మన ప్రభుత్వం తెచ్చిన విద్యుత్ సంస్కరణలు.. ఆ తర్వాత ఎన్నో రాష్ట్రాలకు రోల్ మోడల్ అయ్యాయి. మహిళా సాధికారతకు తెచ్చిన డ్వాక్రా సంఘాలు దేశంలోనే రోల్ మోడల్‌గా నిలిచాయి. బీసీలకు రాజ్యాధికారం కట్టబెట్టాం. ఎస్సీలకు వర్గీకరణతో సమన్యాయం చేశాం. ఎస్టీలకు భూములు, పథకాలు ఇచ్చి జీవితాలు మార్చాం. మైనారిటీల కోసం కార్పొరేషన్ తీసుకొచ్చాం. వారి జీవన ప్రమాణాలు పెంచాం."అని సీఎం చంద్రబాబు వివరించారు.

### విజయాలు చూశాం... సంక్షోభాలు చూశాం

"తెలుగుదేశం పార్టీ విజయాలనే కాదు.. సంక్షోభాలను, సవాళ్లను చూసింది. ఎంతోమంది కార్యకర్తలు త్యాగాలు చేశారు, ప్రాణాలు పోగొట్టుకున్నారు, ఆస్తులు కోల్పోయారు. నిద్రలేని రాత్రులు గడిపారు. టీడీపీని ఫినిష్ చేస్తామని ఆలోచన చేసిన వారే ఫినిష్ అయ్యారు. ఇందిర హయాంలో ఎన్టీఆర్‌ను గద్దె దించి కుట్రలు పన్నారు... అలిపిరిలో నాపై హత్యాయత్నం చేశారు. 2004 తరువాత టీడీపీ కార్యకర్తల, నేతల ప్రాణాలు తీశారు. ప్రాణాలు కోల్పోయిన కార్యకర్తల పిల్లలను దత్తత తీసుకుని ఎన్టీఆర్ స్కూల్ ఏర్పాటు చేసి చదివించాం. గత ప్రభుత్వ విధ్వంసంపై లోకేష్ యువగళం పాదయాత్ర చేపడితే అడ్డుకున్నారు. కార్యకర్తల అండతో అడుగు ముందుకే వేశాడు. 2019-24 మధ్య కాలంలో నన్ను కూడా జైల్లో పెట్టారు. ఇన్నేళ్ల ప్రస్థానం, నేటి ఈ అధికారం అంతా కార్యకర్తల త్యాగాలు, కష్టం వల్లనే వచ్చింది. కార్యకర్తల సంక్షేమం కోసం ట్రస్ట్ ద్వారా వేల మందికి ఉచిత విద్యను అందిస్తున్నాం. పని చేసిన వాళ్ళకు గుర్తింపు ఉంటుంది. కష్టపడిన వాళ్ళను కాపాడుకుంటాం... పదవులు ఇచ్చి ప్రోత్సహిస్తాం. చంద్రయ్య చేసిన త్యాగాన్ని గుర్తుపెట్టుకుని... కొడుక్కి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చాం."అని ముఖ్యమంత్రి చెప్పారు.

### కార్యకర్తే అధినేత

"పార్టీ గుర్తుపై ఎమ్మెల్యేలు, మంత్రులైన వాళ్ళు దీన్ని బాగా అర్థం చేసుకోవాలి. ప్రతి ఒక్కరూ పార్టీ సిద్ధాంతాలకు, విధానాలను, క్రమ శిక్షణకు కట్టుబడి ఉండాలి. పార్టీ కార్యకర్తల వల్లనే మనం ఇక్కడ ఉన్నాం అని గుర్తుపెట్టుకోవాలి. కార్యకర్తలను పట్టించుకోని వాళ్ళను, ఇబ్బంది పెట్టే నాయకులు మాకు అవసరం లేదు. 2024 ఎన్నికల్లో బీజేపీ-జనసేనతో పొత్తుకు పెట్టుకున్నాం. రికార్డు బద్దలు కొట్టేలా విజయం సాధించాం. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా...కార్యకర్తలు కాలర్ ఎగరేసేలా పాలన అందిస్తున్నాం. సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేశాం. దేశంలోనే ఎవరూ ఇవ్వని స్థాయిలో సామాజిక పెన్షన్లు ఇస్తున్నాం. తల్లికి వందనం, స్త్రీ శక్తి, మత్స్యకారుల సేవలో, అన్నదాత సుఖీభవ ఇచ్చాం. డీఎస్సీ, పోలీస్ రిక్రూట్మెంట్ చేశాం... తాజాగా 10 వేల పోస్టులతో జాబ్ క్యాలెండర్ ఇచ్చాం. చెప్పినట్టుగా 20 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించేలా పెద్ద ఎత్తున పరిశ్రమలు తెస్తున్నాం... ఇప్పటికే 6.28 లక్షల ఉద్యోగవకాశాలు కల్పించాం. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ఎన్నికల ముందు హామీ ఇచ్చాం... చెప్పినట్టుగా ఒక్క పైసా కూడా పెంచలేదు. ట్రూ అప్ నుంచి ట్రూ డౌన్ చేశాం. ఈ ఏడాది కూడా విద్యుత్ ఛార్జీలు పెంచం.. భవిష్యత్ లోనూ పెంచబోం. పోలవరాన్ని పూర్తి చేస్తాం... అమరావతిలో మొదట ప్రారంభించిన పనులు 2028 ఆగస్టుకు పూర్తి చేసి ప్రధాని చేతుల మీదుగా ప్రారంభిస్తాం. అమరావతి దేవతల రాజధాని కాబట్టి కొందరు రాక్షసులకు ఇష్టం లేదు. ఫ్యూచర్ సిటీగా అమరావతిని నిర్మిస్తున్నాం. ఇక మూడు ముక్కలాట లేదు..ఒకే రాష్ట్రం ఒకే రాజధాని.. అదే అమరావతి."అని చంద్రబాబు వివరించారు.

### 44వ టీడీపీ ఆవిర్భావ దినోత్సవాల్లో మారిన పంథా

ఆవిర్భావ దినోత్సవం ఆసాంతం ఫ్రెష్ లుక్ తో, కొత్త తరహాలో జరిగింది. పార్టీ కోసం పని చేసిన వారికి, సీనియర్ కార్యకర్తలకు, యువ నేతలకు పెద్ద పీట వేస్తూ ఆవిర్భావ సభ జరిగింది. సభా వేదిక మీద కార్యకర్తలను... సభికుల్లో సీనియర్ నేతలను కూర్చొబెట్టి ఆవిర్భావ సభ నిర్వహించారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్న వారికి, పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారికి, గత ప్రభుత్వంలో వేధింపులు అనుభవించిన వారికి గుర్తింపునిచ్చేలా టీడీపీ ఆవిర్భావ సభ జరిగింది. పార్టీ కోసం బాగా పని చేసిన 19 మంది సామాన్య కార్యకర్తలను సభా వేదిక మీద కూర్చొబెట్టారు. ఇక సభా నిర్వహణ బాధ్యతలను కావలి గ్రీష్మకు అప్పగించారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ కార్యకర్తలు మాట్లాడుతూ... పార్టీ కోసం తాము పని చేసిన విధానాన్ని భావోద్వేగంతో వివరించారు. కార్యకర్తే అధినేత అనే నినాదం నూటికి నూటి పాళ్లు అమలు చేసే పార్టీ టీడీపీనే అంటూ కార్యకర్తల కితాబు ఇచ్చారు. 44వ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని అండమాన్ నికోబార్ దీవుల్లో ఘనంగా నిర్వహించిన టీడీపీ నేతలు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం చంద్రబాబుతో అండమాన్ నికోబార్ టీడీపీ అధ్యక్షుడు మాణిక్య యాదవ్, తెలంగాణ సీనియర్ బక్కని నర్సింహులు మాట్లాడారు. అండమాన్ నికోబార్ దీవుల్లో చేపడుతున్న పార్టీ కార్యక్రమాలను మాణిక్య యాదవ్ వివరించారు. తాము చేపడుతున్న కార్యక్రమాలను చూసేందుకు అండమాన్ నికోబార్ దీవుల్లో పర్యటించాలని కోరారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాల సందర్భంగా టీడీపీ కేంద్ర కార్యాలయం ముందు భారీ టీడీపీ జెండాను సీఎం ఎగరేశారు. జెండావిష్కరణ కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్, టీడీపీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ సహా ఇతర సీనియర్ నేతలు పాల్గొన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలోని ఎన్టీఆర్ విగ్రహానికి చంద్రబాబు, లోకేష్ పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయానికి వచ్చిన నేతలను... కార్యకర్తలను ముఖ్యమంత్రి చంద్రబాబు అప్యాయంగా పలకరించారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ స్థాపన నుంచి ఇప్పటి వరకు జరిగిన ముఖ్య ఘట్టాలతో వీడియో ప్రజెంట్ చేశారు.

# అమరావతికి చట్టబద్ధత..

రాజధానికి శంకుస్థాపన జరిగిన విషయాన్ని వెంకయ్య గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం అందించిన సాయం గురించి ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. 2019 తర్వాత జరిగిన పరిణామాలు, ఎదురైన ఇబ్బందులను వివరించారు. భవిష్యత్తులో అలాంటి పరిస్థితులు ఎదురుకాకుండా కేంద్ర ప్రభుత్వం వెంటనే పార్లమెంటులో బిల్లు పెట్టి ఆమోదించాలని వెంకయ్య నాయుడు కోరారు. ఈ విషయంపై అమిత్ షా సానుకూలంగా స్పందించారు. తన మంత్రిత్వ శాఖ నుంచి అన్నీ క్లియర్ అయ్యాయని, క్యాబినెట్‌లో పెట్టి ఆమోదించడం ఒక్కటే మిగిలింది అని అమిత్ షా అన్నట్లు వెంకయ్య తెలిపారు.

# తెలంగాణ శాసనసభ ఆమోదం

అవకాశం లేదు. సమాజం తలదించుకునేలా కొందరు పిల్లలు వ్యవహరిస్తున్నారు. ఆత్మీయతకు సంబంధించిన అంశంపై చట్టం తీసుకురావడం బాధాకరం. తల్లిదండ్రుల యోగక్షేమాలు చూడని వ్యక్తిని సామాజికంగా బహిష్కరించాలి. తల్లిదండ్రులను చూసుకోలేనివాడు సమాజంలో బతకడానికి వీల్లేదు. ప్రభుత్వ ఉద్యోగులకే కాదు.. ప్రజా ప్రతినిధులకు కూడా చట్టం వర్తిస్తుంది." అని రేవంత్‌రెడ్డి అన్నారు.

# ప్రతీక తెలుగుదేశం పార్టీ

సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రారంభమైన తెలుగుదేశం పార్టీ ఒక చరిత్ర సృష్టించిందని అన్నారు. ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన "సమాజమే దేవాలయం - ప్రజలే దేవుళ్లు" అనే సిద్ధాంతం ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిందన్నారు. పేదల కోసం రెండు రూపాయలకే కిలో బియ్యం అందించిన సంక్షేమ పాలనకు ఆయన నాంది పలికారని గుర్తుచేశారు.

### ఎన్టీఆర్ ఆశయాలు... చంద్రబాబు విజన్ ...లోకేష్ నాయకత్వం

ఎన్టీఆర్ చూపిన దారిలోనే నారా చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపించారని మంత్రి కొనియాడారు. సాంకేతికత, పారదర్శక పాలనతో ఆంధ్రప్రదేశ్‌కు అంతర్జాతీయ గుర్తింపు తీసుకువచ్చారని తెలిపారు. ప్రస్తుతం అదే స్ఫూర్తితో మంత్రి నారా లోకేష్ యువ నాయకుడిగా పార్టీని ముందుకు నడిపిస్తూ కార్యకర్తల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతున్నారని అన్నారు. యువతను ఆకర్షిస్తూ పార్టీని మరింత బలోపేతం చేస్తున్నారని ప్రశంసించారు.

### కార్యకర్తలే పార్టీ బలం

43 ఏళ్లుగా పార్టీ విజయగాథకు కార్యకర్తల త్యాగాలు, అచంచల నిబద్ధతే మూలం అని మంత్రి పేర్కొన్నారు. ఎన్ని సవాళ్లు వచ్చినా "జై తెలుగుదేశం" నినాదంతో ముందుకు సాగడం కార్యకర్తల ప్రత్యేకత అని అన్నారు. పార్టీ కోసం కష్టకాలాల్లోనూ అండగా నిలిచిన సీనియర్ కార్యకర్తలను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు.

### టెక్కలిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతున్నాం

టెక్కలి నియోజకవర్గాన్ని రాష్ట్రానికి ఆదర్శంగా నిలిపేందుకు సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. గ్రామీణ స్థాయిలో మౌలిక వసతులు, ఉపాధి, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని వెల్లడించారు.

### జిల్లా అభివృద్ధికి సమిష్టి కృషి

స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సహకారంతో జిల్లాలో పరిశ్రమలు తీసుకురావడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. వ్యవసాయ రంగ అభివృద్ధికి అన్ని విధాల మద్దతు అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు రూ.612 కోట్ల భారీ ప్రాజెక్ట్‌ను అమలు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యమని చెప్పారు.

### నా జీవితం పార్టీకి అంకితం

తన కుటుంబం తెలుగుదేశం పార్టీకి, కార్యకర్తలకు, చంద్రబాబు నాయుడు, లోకేష్ నాయకత్వానికి అంకితమై ఉందని మంత్రి స్పష్టం చేశారు. పదవులు ఉన్నా లేకపోయినా పార్టీ కోసం పనిచేయడం తమ సిద్ధాంతమని తెలిపారు. పార్టీ కార్యకర్తల త్యాగం, కష్టసాధన ఫలితమే నేడు అధికారంలోకి రావడం సాధ్యమైందని మంత్రి పేర్కొన్నారు. వైకాపా పాలనలో ఎదురైన ఇబ్బందులను ధైర్యంగా ఎదుర్కొని పార్టీని కాపాడిన ప్రతి కార్యకర్త సేవలు అమూల్యమని కొనియాడారు.

# మళ్లీ మళ్లీ కూటమి ప్రభుత్వమే రావాలి

విధ్వంసం జగన్ క్రెడిట్ అని, వాటిని చోరీ చేయాల్సిన దౌర్భాగ్యం తమకు లేదని మంత్రి సవిత స్పష్టంచేశారు. టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్స వేడుకలు పెనుకొండలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ సర్కిల్ అన్న నందమూరి తారకరామారావు విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ప్రజా సంక్షేమానికి పార్టీ కార్యకర్తలు నిబద్ధత, నిజాయితీతో పనిచేస్తున్నారన్నారు. సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లు అనే సిద్ధాంతంతో అన్నఎన్టీఆర్ ఇదే రోజు టీడీపీని స్థాపించారన్నారు. నాడు ఒక్కరితో ప్రారంభమైన ప్రయాణం నేడు కోటి మందితో అతి పెద్ద కుటుంబంగా టీడీపీ ఆవిర్భవించిందన్నారు. ఎన్టీఆర్ ఆశయ సాధనకు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ నిరంతరం కష్టపడుతున్నారన్నారు. వారి నేతృత్వంలో టీడీపీ మరింత బలోపేతమైందన్నారు. 5 ఏళ్ల జగన్ పాలనలో ఎన్ని కేసులు పెట్టిన, ఎంత వేధించినా టీడీపీ కార్యకర్తలు భుజాన ఉన్న పసుపు జెండాను దించని యోధులని మంత్రి సవిత కొనియాడారు.

### కష్టపడిన కార్యకర్తను పార్టీ విస్మరించదు...

టీడీపీకి పార్టీ కార్యకర్తలే వెన్నుముక అని, పార్టీ అభ్యున్నతి కోసం కష్టించి పనిచేసిన వారిని అధిష్టానం ఎప్పుడూ విస్మరించబోదని మంత్రి సవిత స్పష్టంచేశారు. పార్టీ బలోపేతానికి కృషిచేసిన వారందరికీ పదవులు తప్పనిసరిగా వరిస్తాయన్నారు. పీక మీద కత్తి పెట్టి బెదిరించినా భయపడకుండా జై చంద్రబాబు, జై టీడీపీ అంటూ ప్రాణత్యాగం చేసిన చంద్రయ్య మనకు స్ఫూర్తి అని అన్నారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతం చేపడుతోందన్నారు. వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపైనా, నాయకుడిపైనా ఉందని మంత్రి సవిత స్పష్టంచేశారు.

### మళ్లీ మళ్లీ కూటమి ప్రభుత్వాలే రావాలి...

ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి అసమర్థ పాలన వల్ల రాష్ట్రం అస్తవ్యస్తమైందని మంత్రి సవిత మండిపడ్డారు. చివరికి ఏపీకి రాజధాని కూడా లేకుండా పోయిందన్నారు. మరోసారి సీఎం చంద్రబాబు అధికారంలోకి రావడంతో, రాజధాని అమరావతి పనులు ఊపందుకున్నాయన్నారు. రాజధానిని భవిష్యత్తులో మరెవరూ కదపకుండా ఉండేలా అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రానికి పంపామన్నారు. కూటమి నాయకులను టీడీపీ శ్రేణులు కలుపుకుపోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కూటమి ప్రభుత్వాలే అధికారంలోకి మళ్లీ మళ్లీ రావాలన్నారు. కష్టకాలంలో సీఎం చంద్రబాబుకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అండగా నిలిచారన్నారు. ఏపీని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేలా ప్రధాని నరేంద్రమోడి వెన్నుదన్నుగా నిలుస్తున్నారని మంత్రి సవిత తెలిపారు.

### దోపిడి, విధ్వంసమే జగన్ క్రెడిట్

క్రెడిట్ చోరీ చేస్తున్నారంటూ సీఎం చంద్రబాబును, కూటమి ప్రభుత్వానుద్దేశించి జగన్ తరుచుగా విమర్శించడంపై మంత్రి సవిత తీవ్రంగా మండిపడ్డారు. విధ్వంసం చేయడం, దోచుకోవడం జగన్ క్రెడిట్ అని విమర్శించారు. అటువంటి జగన్ క్రెడిట్ ను తాము చోరీ చేయాల్సిన దుస్థితి పట్టలేదన్నారు. తమదంతా అభివృద్ధిపథమన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేయడమే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. ఎంతో కీలకమైన అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుపై ప్రత్యేక అసెంబ్లీ జరిగినా జగన్ పట్టించుకోలేదన్నారు. ఆయనకు రాష్ట్రం పట్ల, ప్రజల పట్ల చిత్తశుద్ధి ఈ ఘటనే చిన్న ఉదాహరణ అని మంత్రి సవిత అన్నారు.

# టీవీకే అభ్యర్థుల జాబితా విడుదల..

డీఎంకే మధ్యే అసలైన పోటీ ఉందన్నారు. 'విజిల్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్నా. గెలిచిన తర్వాత ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయం. అవినీతికి పాల్పడం. మహిళలకు భద్రత కల్పిస్తాం. మాదకద్రవ్యరహిత తమిళనాడుగా రాష్ట్రాన్ని మారుస్తాం. రాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించం' అని విజయ్ వాగ్దానాలు చేశారు. రాష్ట్ర శ్రేయస్సు కోసం.. టీవీకేకు ఒక్క అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

# మనం గర్వించాలి : ప్రధాని మోదీ

పేర్కొన్నారు. ఇక స్క్వాష్ క్రీడాకారిణి అనాహత్‌సింగ్ ది స్క్వాష్ ఆన్ ఫైర్ ఓపెన్ 2026 విజయాన్ని అభినందించారు. అద్భుతమైన ప్రతిభతో ఇంగ్లాండ్ టాప్‌సీడ్ ప్లేయర్ జార్జినా కెన్నెడీని ఓడించి టైటిల్‌ను కైవశం చేసుకోవడాన్ని కొనియాడారు. పీఎస్ఏ వరల్డ్ ర్యాంకింగ్స్‌లో టాప్-20లో చేరిన అతిపిన్న ఆసియా క్రీడాకారిణిగా నిలిచారన్నారు.

# మహిళలకు రూ.8 వేల కూపన్లు

నిర్మాణం, తదితర హామీలను మేనిఫెస్టోలో పేర్కొంది.

కుటుంబంలో మహిళా పెద్దకు ఇస్తున్న ఆర్థిక సాయం రూ.వెయ్యి నుంచి రూ.2వేలకు పెంపు

వృద్ధాప్య పింఛను రూ.2వేలకు పెంపు

పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకం కొనసాగింపు (ప్రస్తుతం ఐదో తరగతి వరకు ఉండగా.. ఎనిమిదో తరగతి వరకు అమలు)

యువతకు ఉచిత ల్యాప్‌టాప్‌లు (దాదాపు 35 లక్షల మందికి ప్రయోజనం)

రైతులకు ఉచితంగా మీటరు లేని మోటార్లు

వచ్చే ఐదేళ్లలో 10లక్షల కొత్త ఇళ్ల నిర్మాణం

ఆరోగ్య బీమా పథకం వార్షికాదాయ పరిమితి రూ.5లక్షలకు పెంపు, రూ.10లక్షల ఆరోగ్య బీమా

ఉన్నత విద్య అభ్యసించే విద్యార్థినులకు ఇస్తున్న ఆర్థిక సాయం రూ.1500లకు పెంపు

మహిళలకు రూ.8000 విలువైన కూపన్ (టీవీ వంటి గృహోపకరణాలు కొనుక్కోవడం లేదా మార్చుకోవడానికి) వంటి హామీలను ప్రకటించారు.

# పార్టీకి కార్యకర్తలే బలం

కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మంత్రి అనిత కార్యకర్తల వద్దకు వెళ్లి ఆప్యాయంగా పలకరించడంతో పాటు, వారితో ప్రతిజ్ఞ చేయించారు. టీడీపీ సీనియర్ కార్యకర్తలను సత్కరించారు. అనంతరం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ, బోదుగల్లం గ్రామంలో పార్టీ జెండా ఎగురవేయడం ఆనందంగా ఉందన్నారు. పార్టీ బలం కార్యకర్తలే అని, కార్యకర్తలు బలంగా ఉంటేనే పార్టీ బలంగా ఉంటుందన్నారు. 44 సంవత్సరాలుగా టీడీపీ విజయవంతంగా కొనసాగుతుండటానికి కార్యకర్తలే కారణం అని పేర్కొన్నారు.అలాగే, ఎన్టీ రామారావును యుగపురుషుడిగా అభివర్ణిస్తూ, ఆయన రాజకీయాల్లోకి రావడం తెలుగు ప్రజల అదృష్టమన్నారు. మహిళలకు సమాన హక్కులు, రాజకీయ ప్రాధాన్యత కల్పించిన నాయకుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. మహిళ విద్య, ఆరోగ్యంపై ఆయన ఇచ్చిన ప్రాధాన్యతను గుర్తు చేశారు. ప్రస్తుతం నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో టీడీపీ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని, నారా లోకేష్ కార్యకర్తల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. గత పాలనలో కూడా టీడీపీ కార్యకర్తలు భయపడకుండా పోరాటం చేశారని అన్నారు. కార్యక్రమం అనంతరం మంత్రి అనిత కార్యకర్తలతో కలిసి భోజనం చేసి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

# తెలుగుజాతి కోసం జన్మించిన పార్టీ తెలుగుదేశం

మాట్లాడుతూ.. టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు గారికి, రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు గారికి, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులకు 44వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు. 1982 మార్చ్ 29, మధ్యాహ్నం 2.30 దేశ, రాష్ట్ర రాజకీయ చరిత్ర మార్చిన రోజు. నేను తెలుగువాడిని, నాది తెలుగుదేశం పార్టీ, నా పార్టీ తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం అంటూ విశ్వ విఖ్యాత నట సార్వభౌమ స్వర్గీయ శ్రీ నందమూరి తారకరామారావు గారు గర్జించిన గొప్ప రోజు. తెలుగుజాతి కోసం జన్మించిన పార్టీ మన తెలుగుదేశం. తెలుగువారి గుండె చప్పుడు మన తెలుగుదేశం.

### మానవత్వానికి మానవ రూపం అన్న ఎన్టీఆర్

మానవత్వానికి మానవ రూపం అన్న ఎన్టీఆర్. చైతన్య రథం ఎక్కి ప్రజల్లోకి వెళ్లిన దమ్మున్న నాయకుడు. అప్పటి వరకూ ఏ నాయకుడూ చేయని సాహసం ఆయన చేశారు. 35 వేల కిలోమీటర్ల యాత్ర చేశారు. మా మామయ్య నందమూరి బాలకృష్ణ గారి పెళ్లి ఓవైపు, రామకృష్ణ గారి పెళ్లి ఇంకోవైపు ఉన్నా ఆయన రాలేదు. ఒక పవిత్ర బాధ్యత చేపట్టానని, విజయం సాధించిన తర్వాతే ఇంటికి వెళ్తానని చెప్పిన గొప్ప వ్యక్తి అన్న ఎన్టీఆర్. చేయెత్తి జై కొట్టు తెలుగోడా అని అన్న ఎన్టీఆర్ పిలుపు ఇచ్చారు. ఢిల్లీ అహంకారానికి, తెలుగు ఆత్మగౌరవానికి మధ్య యుద్ధం జరిగింది. పార్టీ పెట్టిన కేవలం 9 నెలల్లోనే అధికారంలోకి వచ్చింది తెలుగుదేశం పార్టీ. దేశ చరిత్రలో అదొక రికార్డ్. ఆ రోజు నుంచి ఈ రోజు వరకూ మన రికార్డులు బద్దలు కొట్టిన వారు లేరు. రికార్డులు బద్దలు కొట్టాలన్నా, వాటిని తిరగరాయాలి అన్నా అది ఒక్క తెలుగుదేశం పార్టీకి మాత్రమే సాధ్యం.

### కార్యకర్తలే టీడీపీ బలం, బలగం

కార్యకర్తలే టీడీపీ బలం, బలగం. పసుపు జెండా చూస్తేనే మనకు ఎక్కడలేని పౌరుషం. పార్టీ కోసం ప్రాణాలు ఇచ్చే దమ్ము, ధైర్యం ఉన్న కార్యకర్తలు ఒక్క తెలుగుదేశం పార్టీకే సొంతం. ప్రత్యర్థులు మీద పడుతున్నా మీసం మెలేసి తొడకొట్టిన అంజిరెడ్డి తాత లాంటి కార్యకర్తలు మన ధైర్యం. మెడ మీద కత్తి పెట్టి వాళ్ల నాయకుడి పేరు చెప్పమంటే జై టీడీపీ, జై చంద్రబాబు అంటూ ప్రాణాలు సైతం లెక్కచేయని తోట చంద్రయ్య లాంటి కార్యకర్తలు మన పౌరుషం. ప్రత్యర్థుల దాడిలో కన్నుపోయినా తగ్గేదే లేదు అన్న చెన్నుపాటి గాంధీ మనకు స్ఫూర్తి. కత్తులతో దాడి చేసినా, రక్తం కారుతున్నా ఎన్నికలు అయ్యే వరకూ పోలింగ్ బూత్ లోనే కూర్చున్న మంజులా రెడ్డి లాంటి కార్యకర్తలు మనకు ఆదర్శం. ఆ రోజు నుంచి ఈ రోజు వరకూ తెలుగుదేశం పార్టీ కంచుకోటకి కాపలా కాస్తుంది తెలుగుదేశం పార్టీ కార్యకర్తలే. జెండాలు మోసింది కార్యకర్తలు, పోరాడింది కార్యకర్తలు. అందుకే నాకు ఈ కార్యకర్తలే అధినేత అని ఈ సభాముఖంగా తెలియజేస్తున్నా. శ్రీకాకుళం జిల్లా రాజాం నియోజకవర్గం అంతకాపల్లి అనే గ్రామంలో ఓ పెద్దాయన పేరు తెలుగుదేశం. పిల్లల నుంచి ముసలివాళ్ల వరకూ అందరూ ఆయనను తెలుగుదేశం అనే పిలుస్తారు. ఆయన సొంత పేరు చాలా మందికి తెలియదు. ఆ పెద్దాయన కూడా తనను తెలుగుదేశం అని పిలిస్తేనే పలుకుతారు. ఈ విషయాన్ని పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్నాక చాలా గర్వంగా ఉండేది. నాపై బాధ్యత మరింత పెరిగింది. ఇంతటి అదృష్టం ఏ రాజకీయ పార్టీకి ఉంటుంది?

### దేశానికి సంక్షేమాన్ని పరిచయం చేసింది అన్న ఎన్టీఆర్

దేశానికి సంక్షేమాన్ని పరిచయం చేసింది అన్న ఎన్టీఆర్. దేశంలోనే మొదటి సారి పెన్షన్ ఇచ్చింది అన్న ఎన్టీఆర్. రూ.2 లకే కిలో బియ్యం, రైతులకు రూ.50 కే హార్స్ పవర్ విద్యుత్, నిరుపేదలకు పక్కా ఇళ్లు, గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసింది అన్న ఎన్టీఆర్. మహిళలకు ఆస్తిలో సమాన హక్కు ఇచ్చింది అన్న ఎన్టీఆర్. పటేల్ పట్వారి వ్యవస్థను రద్దు చేసింది అన్న ఎన్టీఆర్. బీసీలకు ఆర్థిక, రాజకీయ స్వాతంత్ర్యం ఇచ్చింది అన్న ఎన్టీఆర్. తిరుపతి లో మొదటి మహిళా యూనివర్సిటీ ఏర్పాటు చేసింది అన్న ఎన్టీఆర్. తెలుగుగంగ ప్రాజెక్టు ఆర్కిటెక్ట్ అన్న ఎన్టీఆర్. తిరుమలలో నిత్యాన్నదానం ప్రారంభించింది అన్న ఎన్టీఆర్. ఇలా చెప్పుకుంటూ పోతే ఒకరోజు పడుతుంది. కేవలం ఏడేళ్లలోనే అన్న ఎన్టీఆర్ అనేక సంక్షేమ కార్యక్రమాలను తీసుకువచ్చారు.

### దేశానికి అభివృద్ధిని పరిచయం చేసింది మన బ్రాండ్ సీబీఎన్

దేశానికి అభివృద్ధిని పరిచయం చేసింది మన బ్రాండ్ సీఎం చంద్రబాబునాయుడు గారు. ప్రజల వద్దకు పాలన ప్రారంభించింది మన సీబీఎన్. విద్య, ఉద్యోగాల్లో మహిళలకు 33.33 శాతం రిజర్వేషన్ ఇచ్చింది మన సీబీఎన్. మహిళలకు కోసం దీపం పథకం ప్రారంభించింది మన సీబీఎన్. బీసీలకు స్థానిక సంస్థల్లో 33 శాతం రిజర్వేషన్ ఇచ్చింది మన సీబీఎన్. డ్వాక్రా పథకం ప్రారంభించింది మన సీబీఎన్. పట్టిసీమ నిర్మించింది సీబీఎన్. రైతు బజార్లు ప్రారంభించింది మన సీబీఎన్. సైబరాబాద్ కట్టిందీ ఆయనే... అమరావతి కడుతోంది ఆయనే. అప్పుడు ఐటీ - ఇప్పుడు క్వాంటం. వయస్సు 75 కానీ స్పీడ్ 25 ఏళ్ల కుర్రాడు. ఆయన రికార్డులు బద్దలు కొట్టే వ్యక్తి ఇంకా పుట్టలేదు, పుట్టడు. అదీ మన సీబీఎన్.

### కేంద్ర ప్రభుత్వాల ఏర్పాటులో కీలక పాత్ర పోషించాం

గల్లీ నుంచి ఢిల్లీ వరకూ పసుపు జెండా పవర్ ఏంటో చూపించాం. జాతీయ రాజకీయాల్లోనూ సైకిల్ ముద్ర ఉంది. నేషనల్ ఫ్రంట్, యునైటెడ్ ఫ్రంట్, ఎన్డీయే సంకీర్ణ ప్రభుత్వాల్లో కీలకపాత్ర పోషించింది తెలుగుదేశం పార్టీ. రాష్ట్రపతిగా అబ్దుల్ కలాంను ప్రతిపాదించింది మన సీబీఎన్. పార్లమెంట్ కు మొదటి దళిత స్పీకర్ గా జీఎంసీ బాలయోగిని నియమించింది మన సీబీఎన్. అంబేద్కర్ గారికి భారతరత్న రావడంలో కీలకపాత్ర పోషించింది అన్న ఎన్టీఆర్. హైవేల నిర్మాణం, విద్యుత్, టెలికాం, ఐటీ రంగాలు, డిజిటల్ పేమెంట్స్, ఇప్పుడు డేటా సెంటర్.. ఇలా అనేక సంస్కరణలు తీసుకురావడంలో కీలక పాత్ర పోషించింది తెలుగుదేశం పార్టీ.

### టీడీపీని లేకుండా చేస్తామనే వాళ్లే అడ్రస్ లేకుండా పోయారు

తెలుగుదేశం పార్టీ లేకుండా చేస్తాం అని కొంత మంది అన్నారు. ఇప్పుడు వాళ్ళే అడ్రస్ లేకుండా పోయారు. అర్థమైందా రాజా! 2019 నుంచి 2024 వరకూ అరాచక పాలన మనం చూశాం. ఐదేళ్లలో 79 మంది కార్యకర్తలను, నాయకులను చంపారు. తోట చంద్రయ్యను చంపేస్తే పాడె మోసింది మన సీబీఎన్. ఇప్పుడు ఆ కుటుంబాన్ని ఆదుకుంది మన సీబీఎన్. కొన్ని రాజకీయ పార్టీలు వాళ్ల స్వార్థం కోసం కార్యకర్తలతో కత్తి పట్టించాయి. మన సీబీఎన్ కార్యకర్తల పిల్లలకు పుస్తకాలు పట్టించారు. ఫ్యాక్షన్ దాడుల్లో కార్యకర్తలు చనిపోతే వారి పిల్లలను దత్తత తీసుకుని చదివించి ప్రయోజకులుగా మార్చింది మన సీబీఎన్. పాదయాత్రలో నేను ఆ పిల్లలను కలిశా. ఒకరు డెలాయిట్, మరొకరు గూగుల్ వంటి అంతర్జాతీయ సంస్థల్లో పనిచేస్తున్నారు. కార్యకర్తలు, నేతలపై వేల కేసులు పెట్టి వేధించారు. మన దేవాలయం పార్టీ కేంద్ర కార్యాలయంపై దాడి చేశారు. మన అధినేత ఇంటికి తాళ్లు కట్టారు. మన అధినేతను అక్రమంగా అరెస్ట్ చేసి 53 రోజులు జైల్లో పెట్టారు. క్లైమోర్ మైన్లకే భయపడని బ్లడ్ మాది. మీరు పెట్టే కేసులు, దాడులకు భయపడతామా? 2024 ఎన్నికల్లో మన స్ట్రైక్ రేట్ 94 శాతం. 57 శాతం ఓట్ షేర్. 8 ఉమ్మడి జిల్లాలు క్లీన్ స్వీప్.

### దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా సంక్షేమం అందిస్తున్నాం

దేశంలో ఏ రాష్ట్రంలో లేని సంక్షేమం మన సీబీఎన్ అందిస్తున్నారు. వృద్ధులకు రూ.4వేల పెన్షన్, వికలాంగులకు రూ.6వేలు, మంచానికి పరిమితం అయిన వారికి రూ.15 వేలు ఇస్తున్నాం. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇంత పెద్దఎత్తున పెన్షన్లు ఇవ్వడం లేదు. దీపం పథకం కింద ఏటా ఉచితంగా 3 సిలిండర్లు అందిస్తున్నాం. 16,347 టీచర్ పోస్టులు భర్తీ చేశాం. 6 వేల కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేశాం. 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్ విడుదల చేశాం. ఏడాదిలో ఆయా ఖాళీలను భర్తీ చేస్తాం. ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి తల్లికి వందనం కింద రూ.15వేలు ఇస్తున్నాం.

### బాగా పనిచేసిన కార్యకర్తలను అధినేత చంద్రబాబు పక్కన కూర్చొబెట్టాం

నేను బయట ఎంత పోరాడుతున్నానో పార్టీలో కూడా అంతే పోరాడుతున్నా. సంస్కరణల కోసం మనం కలిసికట్టుగా పోరాడాలి. కష్టపడుతున్న కార్యకర్తలను మనం గుర్తించాలి. ఆ బాధ్యత నాపైనా ఉంది. కష్టపడుతున్న కార్యకర్తలను గ్రామస్థాయి నుంచి పొలిట్ బ్యూరో వరకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మన పార్టీపై ఉంది. ఈ రోజు జాతీయ అధ్యక్షులు చంద్రబాబు గారి పక్కన ఎవరు కూర్చున్నారో గమనించాలి. ప్రతిపక్షంలో, అధికారంలో అహర్నిశలు కష్టపడిన వారు. వారిని నేడు గుర్తించి గౌరవ అధ్యక్షులు చంద్రబాబు గారి పక్కన కూర్చోబెట్టడం జరిగింది. బాగా పనిచేసిన కార్యకర్తలను గుర్తించాల్సిన బాధ్యత మాపై ఉంది. మీరు కష్టపడిన విధానం మాకు చెప్పాల్సిన బాధ్యత మీపై ఉంది. అందుకే 'మై టీడీపీ' యాప్ ద్వారా పార్టీ కార్యక్రమాలను నమోదు చేయాలి. పార్టీ నేతలు అలక వీడాలి. దీనివల్ల నష్టపోయేది కార్యకర్తలు, ప్రజలు. 'మై టీడీపీ' యాప్ లోని సీబీఎన్ కనెక్ట్ ఆప్షన్ ద్వారా ఎవరైనా తమ అభిప్రాయాలు తెలియజేయవచ్చు.

# ఎడిటర్ వాయిస్

## గ్యాస్ సిలిండర్లతో ఉడాయించిన డెలివరీ బాయ్..

పశ్చిమాసియా యుద్ధం వల్ల చమురు సంక్షోభం తలెత్తి పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్ని తాకుతుంటే.. విశాఖపట్నంలో ఒక గ్యాస్ డెలివరీ బాయ్ ఏకంగా 30 ఎల్పీజీ సిలిండర్లతో ఉడాయించడం చూస్తుంటే 'అడకత్తెరలో పోకచెక్క' లాంటి సామాన్యుడి పరిస్థితి అర్థం అవుతోంది. గ్యాస్ సిలిండర్ కోసం నెలల తరబడి వేచి చూసే వినియోగదారుల నమ్మకాన్ని ఆసరాగా చేసుకొని, ఓటీపీలు సేకరించి మరీ ఈ భారీ మోసానికి పాల్పడడం గమనార్హం. విశాఖపట్నంలో సంచలనం సృష్టించిన ఈ గ్యాస్ సిలిండర్ల అపహరణ ఉదంతం, దాని వెనుక ఉన్న ముఠా కోణాలపై లోతుగా పరిశీలిస్తే..

**వినియోగదారులకు నమ్మకద్రోహం!**

ఈ కేటుగాడు అనుసరించిన తీరు వింతగా ఉంది. సాధారణంగా గ్యాస్ డెలివరీ సమయంలో ఓటీపీ చెప్పడం అనేది ఒక భద్రతా నియమం. సదరు డెలివరీ బాయ్ కస్టమర్ల వద్దకు వెళ్లి గ్యాస్ సిలిండర్ ఇచ్చే ముందే వారి నుంచి ఓటీపీలను సేకరించాడు. అంటే రికార్డుల్లో గ్యాస్ డెలివరీ అయినట్లు చూపిస్తూ, వాస్తవానికి ఆ సిలిండర్లను తన వద్దే ఉంచుకున్నాడు. ఇలా సుమారు 30 మంది కస్టమర్ల వద్ద ఓటీపీలు తీసుకున్న తర్వాత, ఆ 30 నిండు సిలిండర్లతో ఒక్కసారిగా పరారయ్యాడు. గ్యాస్ అందలేదని వినియోగదారులు ఏజెన్సీని సంప్రదించడంతో ఈ భాగోతం బయటపడింది.

**బ్లాక్ మార్కెట్ ఆశ?**

ప్రస్తుతం అంతర్జాతీయంగా జరుగుతున్న యుద్ధం వల్ల ఇంధన వనరుల కొరత ఏర్పడింది. రాబోయే రోజుల్లో గ్యాస్ ధరలు పెరిగే అవకాశం ఉందన్న ప్రచారం జరుగుతోంది. బహుశా ఆ 30 సిలిండర్లను బ్లాక్ మార్కెట్‌లో భారీ ధరలకు విక్రయించి సొమ్ము చేసుకోవాలనేది ఆ నిందితుడి ప్లాన్ అయి ఉండవచ్చు. యుద్ధం వల్ల గ్యాస్ కొరత ఉన్న సమయంలో ఇలాంటి దొంగతనాలు జరిగితే, ఏజెన్సీలు వెంటనే కొత్త స్టాక్ తెప్పించడం కష్టం అవుతుంది. దీనిని ఆసరాగా చేసుకొని డెలివరీ బాయ్ ఈ సాహసానికి ఒడిగట్టినట్లు తెలుస్తుంది.

**విచారణలో కీలక అంశాలు!**

బాధితుల ఫిర్యాదు మేరకు విశాఖ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడు ఎక్కడికి వెళ్లాడు? ఆ సిలిండర్లను ఎక్కడ దాచాడు? అనే కోణంలో పోలీసులు సెల్ ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా గాలిస్తున్నారు. కేవలం ఒక డెలివరీ బాయ్ 30 సిలిండర్లను మోయడం సాధ్యం కాదు కాబట్టి, దీని వెనుక ఏదైనా పెద్ద ముఠా ఉందా? లేదా ఏదైనా వాహనం ద్వారా వీటిని తరలించారా? అని విచారిస్తున్నారు. ఆ సిలిండర్లను రికవరీ చేయడం పోలీసులకు పెద్ద సవాలుగా మారింది.

**వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి**

ఈ ఘటన గ్యాస్ కనెక్షన్ ఉన్న ప్రతి ఒక్కరికీ ఒక హెచ్చరిక. గ్యాస్ సిలిండర్ మీ కళ్ల ముందు ఉండి, దాని సీల్ సరిగ్గా ఉందో లేదో తనిఖీ చేసిన తర్వాతే డెలివరీ బాయ్‌కి ఓటీపీ చెప్పాలి. ముందే ఓటీపీ ఇస్తే ఇలాంటి మోసాలకు ఆస్కారం ఉంటుంది. గ్యాస్ బుకింగ్, డెలివరీ స్టేటస్‌ను కంపెనీ అధికారిక యాప్స్‌లో ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలి. డెలివరీ బాయ్ ఇచ్చే ఫిజికల్ బిల్లును జాగ్రత్తగా ఉంచుకోవాలి. ఇది ఏదైనా సమస్య తలెత్తినప్పుడు సాక్ష్యంగా ఉపయోగపడుతుంది.

**గ్యాస్ ఏజెన్సీల బాధ్యత..**

ఈ మోసం గ్యాస్ ఏజెన్సీల నిర్వహణ లోపాలను కూడా ఎత్తిచూపుతోంది. తమ వద్ద పనిచేసే డెలివరీ బాయ్స్ నేపథ్యాన్ని ఏజెన్సీలు సరిగ్గా చూడటం లేదని విమర్శలు వస్తున్నాయి. ఒక్క డెలివరీ బాయ్ వద్దకు 30 సిలిండర్లు వెళ్లే వరకు ఏజెన్సీ ఎందుకు గమనించలేదనేది కూడా ప్రశ్న. ఏజెన్సీలు తమ డెలివరీ సాఫ్ట్‌వేర్‌లో రియల్ టైమ్ ట్రాకింగ్ సిస్టమ్‌ను మెరుగుపరుచుకోవాలి. యుద్ధం తెచ్చిన కష్టాల కంటే, ఇలాంటి మనుషులు చేసే మోసాలే సామాన్యుడిని ఎక్కువ బాధిస్తాయి. విశాఖపట్నంలో జరిగిన ఈ 30 సిలిండర్ల చోరీ ఉదంతం.. టెక్నాలజీని కూడా మోసాలకు ఎలా వాడుకోవచ్చో నిరూపించింది. పోలీసులు నిందితుడిని త్వరగా పట్టుకొని, ఆ సిలిండర్లను రికవరీ చేసి బాధితులకు అందజేస్తారని ఆశిద్దాం. కొరత ఉన్న సమయంలో ప్రతి గ్యాస్ సిలిండర్ ఒక విలువైన వనరు అనే విషయాన్ని మనం మర్చిపోకూడదు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్



# క్రైం వాయిస్

## భర్త దూరమై.. బతుకు భారమై..

### ఇద్దరు పిల్లలను చంపి తల్లి బలవన్మరణం





**కంది, విశ్వం వాయిస్ న్యూస్ :** నవమాసాలు మోసింది.. పురిటినొప్పులు భరించింది.. కుమారుడు, కుమార్తె పుట్టగానే సంతోషపడింది.. సర్వస్వం వాళ్లే అనుకొని భర్తతో కలిసి అల్లారుముద్దుగా చూసుకుంది. అంతలోనే భర్త రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడాన్ని భరించలేకపోయింది. పిల్లలను చంపి తానూ ఆత్మహత్య చేసుకుని తనువు చాలించింది. ఈ విషాద ఘటన సంగారెడ్డి జిల్లా కంది మండలం జుల్కల్‌లో చోటుచేసుకుంది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కంది మండలం మక్త అల్లూర్‌కు చెందిన మమత(28), జుల్కల్‌కు చెందిన ప్రవీణ్ దంపతులకు మణికంఠ(5), ప్రళయశ్రీ(3) సంతానం. దంపతులిద్దరూ కూలి పనులు చేసుకుంటూ పిల్లలను పోషించేవారు. ఈ ఏడాది జనవరి 3న ఎద్దుమైలారం శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రవీణ్ దుర్మరణం చెందారు. తీవ్ర మనోవేదనకు గురైన మమత తమకు దిక్కెవరంటూ.. నిత్యం రోదిస్తూ ఉండేది. మమత తల్లిదండ్రులు, మేనత్త తనతోనే ఉంటూ ధైర్యం చెబుతుండేవారు. ఆసరా పింఛను తీసుకునేందుకు మేనత్త, వేరే పనులపై తల్లిదండ్రులిద్దరూ శనివారం సొంతూళ్లకు వెళ్లారు. ఈ సమయంలో మమత ఇంట్లోనే పిల్లలను హత్య చేసి తానూ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. చిన్నారుల గొంతు భాగంలో గాయాలుండడంతో గొంతు నులిమి చంపి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటనా స్థలాన్ని ఎస్పీ పరితోశ్ పంకజ్, డీఎస్పీ సత్తయ్య, సంగారెడ్డి గ్రామీణ సీఐ క్రాంతికుమార్‌లు పరిశీలించారు. మమత తండ్రి బీర్ల శంకర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బీమా డబ్బుల కోసం... డ్రామా



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఒంటరి మహిళ.. ఆమె కాళ్లు, చేతులు కట్టేశారు.. రూ.27 లక్షల విలువైన బంగారం దోచేశారు.. అంతా అయ్యో పాపం అన్నారు. పోలీసులు కూడా ముమ్మర దర్యాప్తు చేశారు. బంగారం మీద బీమా ఉందని, ఆ సొమ్ము కోసమే నాటకం ఆడానని సదరు మహిళ చెప్పడంతో పోలీసులు అవాక్కయ్యారు. దీనికి సంబంధించి క్రైం డీఎస్పీ సుభాష్ ఆదివారం వివరాలు వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలంలోని కాపవరానికి చెందిన ముంద్రు పద్మ అనే మహిళ.. ఈనెల 26న నలుగురు దొంగలు తనను బంధించి, బంగారం చోరీ చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా ఆమె ఇంట్లోని సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలించారు. తన ఇంట్లోని వస్తువులను చెల్లాచెదురుగా పడేయడం, సీసీ కెమెరాల తీగలను తొలగించడం అన్నీ సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. దీనిపై ఆరా తీయగా అసలు విషయం బయటపడింది. 15 రోజుల క్రితం ఓ దుకాణంలో బంగారు ఆభరణాలు కొనుగోలు చేశారు. షోరూంలో రూ.20వేలు దాటిన వస్తువును కొనుగోలు చేస్తే ఏడాది పాటు బీమా వర్తిస్తుందని తెలుసుకున్నారు. ఆ సొమ్ము కోసమే ఇలా చేసినట్లు అంగీకరించారు. తప్పుడు ఫిర్యాదు చేసినందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి ఆమెపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. చాకచక్యంగా కేసు ఛేదించిన సీఐ మూర్తి, సిబ్బందికి ఎస్పీ రివార్డు ప్రకటించారు.

## బంగారు నగల కోసం అత్తను హతమార్చిన కోడలు

**గాంధారి, విశ్వం వాయిస్ న్యూస్ :** బంగారు నగల కోసం కోడలు అత్తను హతమార్చింది. ఈ విషాద ఘటన కామారెడ్డి జిల్లా గాంధారి మండలం సీతాయిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. సీఐ సంతోష్, ఎస్సై ఆంజనేయులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. సీతాయిపల్లి గ్రామానికి చెందిన కావటి రుక్మవ్వ(75)కు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. అందరికీ పెళ్లిళ్లు అయ్యాయి. ఇద్దరు కుమారులు మరణించగా చిన్న కుమారుడు భార్యాపిల్లలతో కలిసి హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. రుక్మవ్వ, ఇద్దరు కోడళ్లు సీతాయిపల్లి గ్రామంలోనే వేర్వేరుగా ఉంటున్నారు. రుక్మవ్వ వద్ద ఉన్న బంగారు నగల విషయంలో రెండో కోడలు కోటవ్వ, అత్త మధ్య కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. శనివారం రాత్రి రుక్మవ్వ ఒంటరిగా నిద్రిస్తుండగా కోటవ్వ ఆమె ఇంట్లోకి చొరబడింది. బండరాయితో తలపై బాది హత్య చేసింది. అనంతరం రుక్మవ్వ మెడలో ఉన్న బంగారు గుండ్లు, చెవి కమ్మలు తీసుకొని వెళ్లింది. ఆదివారం ఉదయం విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు రుక్మవ్వ ఇంటివద్దకు చేరుకున్నారు. కోటవ్వ కూడా అక్కడికి చేరుకుని ఏమీ తెలియనట్లు వ్యవహరించింది. అనుమానం వచ్చిన కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కోటవ్వను విచారించారు. బంగారం కోసం హత్య చేశానని ఆమె అంగీకరించారు. మృతురాలి కుమార్తె కిష్టవ్వ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనాస్థలాన్ని సీఐ సంతోష్, ఎస్సై ఆంజనేయులు పరిశీలించారు.

## బైక్‌ను ఢీకొన్న లారీ.. బాలుడి మృతి

**పామర్రు, విశ్వం వాయిస్ న్యూస్ :** కృష్ణా జిల్లా పామర్రు- గుడివాడ జాతీయ రహదారిపై ప్రమాదం చోటు చేసుకుంది. ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో 14 ఏళ్ల బాలుడు మృతి చెందాడు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఆరేపల్లి షణ్ముఖ వెంకటేశ్వరరావు, అతడి స్నేహితుడు జగదీశ్ (14) బైక్‌పై వెళ్తుంగా.. గుడివాడ వైపు నుంచి వచ్చిన లారీ వీరిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో వెనుక కూర్చున్న జగదీశ్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. అతడు స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. బైక్ నడిపిన వెంకటేశ్వరరావు కూడా మైనర్ కావడం గమనార్హం. కేసు నమోదు చేసుకున్న ఎస్సై రాజేంద్రప్రసాద్ దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి.

## వైద్యుడి కుటుంబం ఆత్మహత్యాయత్నం.. ఇద్దరి మృతి

**పల్నాడు (మల్లమ్మసెంటర్), విశ్వం వాయిస్ న్యూస్ :** పల్నాడు జిల్లా నరసరావుపేటలో కుటుంబం ఆత్మహత్యాయత్నం కలకలం సృష్టించింది. స్థానిక లాడ్జ్‌లో మూడేళ్ల కూతురితో కలిసి భార్యాభర్తలు ఆత్మహత్యాయత్నం చేశారు. తల్లి శంకరకుమారి (30), చిన్నారి మౌనిక (3) మృతి చెందగా.. భర్త గోపి పరిస్థితి విషమంగా ఉంది. నరసరావుపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. దంపతుల స్వస్థలం నాదెండ్ల మండలం సాతులూరుగా పోలీసులు గుర్తించారు. గోపి భోపాల్ ఎయిమ్స్ ఆస్పత్రిలో వైద్యుడిగా పని చేస్తున్నారు. శంకర కుమారి కూడా అదే ఆస్పత్రిలో నర్సుగా పని చేస్తున్నారు. శనివారం రాత్రి భోపాల్ నుంచి నరసరావుపేటకి వచ్చిన కుటుంబం ఈ దారుణానికి పాల్పడింది. ఘటనకు గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. మత్తు ఇంజక్షన్ చేసుకొని ఉండొచ్చని భావిస్తున్నారు.

## కామారెడ్డి జిల్లాలో రోడ్డు ప్రమాదం.. ముగ్గురి మృతి

**గాంధారి, విశ్వం వాయిస్ న్యూస్ :** కామారెడ్డి జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. గాంధారి మండలంలోని రాంపూర్ గడ్డ సమీపంలో కల్వర్టు వద్ద బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలతో ముగ్గురు కూలీలు మృతిచెందారు. అధిక వేగంతో గాంధారి వైపు వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. బాధితుల తల, ముఖంపై తీవ్రగాయాలు కావడంతో వారు అక్కడిక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతులను ముఖియా(21), రాహుల్ (21), జావీద్ (22)గా గుర్తించారు. ఈ ముగ్గురూ బిహార్, యూపీకి చెందినవారిగా తెలిపారు. వీరు రాంపూర్ గడ్డ వద్ద ఓ రైస్ మిల్లులో పనిచేస్తున్నట్లు చెప్పారు.

## ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులో మంటలు



**విశ్వం వాయిస్ న్యూస్ :** వరంగల్ 2 డిపో ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులో ఆదివారం తెల్లవారుజామున ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. ఛార్జింగ్ అనంతరం పార్కింగ్‌లో ఉంచిన బస్సులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించినట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. మంటలు వేగంగా వ్యాపించడంతో బస్సు వెనుకభాగం దగ్ధమైంది. వెంటనే అప్రమత్తమైన ఆర్టీసీ సిబ్బంది అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని మంటల్ని అదుపుచేశారు. ఈ ప్రమాదంలో బస్సులోని నాలుగు బ్యాటరీలు దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు.

## కృష్ణా జిల్లాలో బాలుడి హత్య..

### నానమ్మకు తీవ్రగాయాలు

**నందివాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** కృష్ణా జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. నందివాడ మండలం పెదలింగాలలో పదేళ్ల బాలుడిని గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేశారు. శనివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. నానమ్మ లక్ష్మి (70)తో కలిసి బాలుడు బాలాజీ ఇంట్లో నిద్రిస్తుండగా దుండగులు దాడికి పాల్పడ్డారు. దీంతో బాలాజీ మృతిచెందగా.. వృద్ధురాలు లక్ష్మికి తీవ్రగాయాలయ్యాయి. ఆమె విజయవాడలోని ఓ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వృద్ధురాలి పరిస్థితి విషమంగా ఉంది. నందివాడ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. సిమెంట్ రాళ్లతో ఇరువురినీ బలంగా కొట్టినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాలుడు, వృద్ధురాలిపై దాడికి గల కారణాలు తెలియరాలేదు.

# పోష్టికాహార భద్రత కోసం బయోఫోర్టిఫైడ్ రకాల పంటలు..




## రెండు నిర్దిష్ట కార్యక్రమాలను ప్రారంభించిన ఐసీఏఆర్



భారతదేశం వ్యవసాయాధారిత దేశం. అయితే రకరకాల అననుకూల పరిస్థితులు.. వ్యవసాయం నష్టాలనే మిగులుస్తుండడం... చీడపీడలు, తెగుళ్లు.. సకాలంలో వానలు కురవకపోవడం.. పంట చేతికొచ్చే సమయానికి వర్షాలు ముంచెత్తడం.. పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించకపోవడం... ఇలాంటి అననుకూల పరిస్థితులతో రైతులు వ్యవసాయం నుంచి తిరుగుముఖం పడుతున్నారు. ఈ క్రమంలో వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అందుబాటులోకి తెస్తున్నాయి. అందులో భాగంగానే nutritional security కోసం కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా biofortified varieties పంటలను పెంచాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ICAR రెండు నిర్దిష్ట కార్యక్రమాలను ప్రారంభించింది. ఈ విషయాన్ని కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి Kailash Choudhary మంగళవారం లోక్‌సభలో తెలిపారు.

**ఆ రెండు కార్యక్రమాలు ఏంటంటే..**

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ రెండు కార్యక్రమాలను రూపొందించింది : న్యూట్రి-సెన్సిటివ్ అగ్రికల్చరల్ రిసోర్సెస్ అండ్ ఇన్నోవేషన్స్, వ్యవసాయంలో విలువ జోడింపు, సాంకేతికత ఇంక్యుబేషన్ సెంటర్లు (వాటికా). వ్యవసాయంలో మహిళలపై ఆల్ ఇండియా కోఆర్డినేటెడ్ రీసెర్చ్ ప్రాజెక్ట్ కింద, ICAR "పోషకాహార భద్రత కోసం స్థిరమైన విధానాలు", "పోషక భద్రత వ్యవసాయ కుటుంబాల ఆరోగ్య ప్రమోషన్" వంటి కార్యక్రమాలను కూడా అమలు చేస్తోంది. లోక్ సభలో ప్రశ్నోత్తరాల సమయంలో, వ్యవసాయాభివృద్ధి విషయంలో తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, కార్యక్రమాలలో భాగంగా పాఠశాలలు, సంఘాలలో న్యూట్రి-గార్డెన్‌లను నిర్మించామని, అక్కడ పోషకాహార విద్యపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని ఆయన తెలిపారు.

**రకరకాల పంటలు..**

ఇంకా దీనిమీద మంత్రి సమాచారం ఇస్తూ.. ICAR వరి, గోధుమ, మొక్కజొన్న, మినుములు, కందులు, వేరుశెనగ, లిన్సీడ్, ఆవాలు, సోయాబీన్‌లలో 79 పోషకాలు అధికంగా ఉండే బయోఫోర్టిఫైడ్ రకాలను అభివృద్ధి చేసింది అని తెలిపారు. కాలీఫ్లవర్, బంగాళదుంప, చిలగడదుంప, గ్రేటర్ యామ్, దానిమ్మ, అదనంగా ఎనిమిది బయోఫోర్టిఫైడ్ ఉద్యాన పంటల రకాలు, వివిధ మాస్ కమ్యూనికేషన్ మాధ్యమాలను కలుపుకొని శిక్షణలు, ప్రదర్శనల ద్వారా రైతులలో ప్రాచుర్యం పొందుతున్నాయి. ఐరన్, జింక్, కాల్షియం, ప్రొటీన్, విటమిన్ సి, ప్రొవిటమిన్ ఎ, ఒలేయిక్ యాసిడ్ వంటి ముఖ్యమైన ఖనిజాలు ఈ సాగులో మెరుగయ్యాయని మంత్రి అభిప్రాయంగా చెప్పుకొచ్చారు..

**ICAR గురించి...**

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ అనేది భారతదేశంలో వ్యవసాయ విద్య, పరిశోధనలను సమన్వయం చేసే స్వయం-పాలన సంస్థ. ఇది వ్యవసాయ మంత్రిత్వ శాఖలోని వ్యవసాయ పరిశోధన, విద్యా శాఖకు నివేదిస్తుంది. దీని అధ్యక్షుడు కేంద్ర వ్యవసాయ మంత్రి. ఇది ప్రపంచంలోనే అత్యంత విస్తృతమైన వ్యవసాయ పరిశోధన, బోధనా సంస్థల నెట్‌వర్క్. NARI కార్యక్రమం పోషకాహార భద్రతను పెంపొందించడానికి వ్యవసాయాన్ని పోషకాహారం, న్యూట్రి-స్మార్ట్ గ్రామాలతో అనుసంధానం చేస్తూ కుటుంబ వ్యవసాయాన్ని ప్రోత్సహించడంపై దృష్టి పెడుతుంది.

# సర్వీసు రోడ్లు వేయడం చేతకాదా..?

## రోడ్లకు మరమ్మతులు చేసిన వైసీపీ శ్రేణులు - బిల్డర్ చిన్న ఆధ్వర్యంలో వినూత్నంగా నిరసన చేపట్టిన నాయకులు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజల ఆకాంక్షలకు, ఆశయాలకు అనుగుణంగా ఎంతో కృషి చేసి మోరంపూడి సెంటర్లో మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ ఫ్లైఓవర్ నిర్మిస్తే గత రెండు సంవత్సరాల కాలంలో సర్వీస్ రోడ్లు వేయడంలో కూటమి పాలకులు పూర్తిగా విఫలమయ్యారని, ప్రజల రోడ్ల భద్రతపై ఈ పాలకులకు శ్రద్ధ లేదని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ధ్వజమెత్తారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం సిటీ అధ్యక్షులు బిల్డర్ చిన్న ఆధ్వర్యంలో మోరంపూడి సెంటర్లో గోతులమయంగా ఉన్న సర్వీస్ రోడ్లకు ఆదివారం మరమ్మత్తులు చేపట్టారు. చిన్నతో పాటు జిల్లా అధికార ప్రతినిధి రొక్కం త్రినాథ్, జిల్లా వైఎస్ఆర్ టియుసి అధ్యక్షులు సప్పా ఆదినారాయణ, సంయుక్తంగా ఈ కార్యక్రమం చేపట్టగా 24 వార్డు ఇంచార్జి కటకం చిన్న,6వ వార్డు ఇంచార్జి గుడివాడ అప్పారావులు పాల్గొని గోతులను పూడ్చారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. ప్రజల చిరకాల వాంఛను మార్గాని భరత్ రామ్ నెరవేర్చారన్నారు. మోరంపూడి ఫ్లైవర్ నిర్మించక ముందు వందలాదిమంది రోడ్డు ప్రమాదంలో మరణించారని, ఎంతోమంది గాయాలపాలయ్యారని అన్నారు. ఎంతోమంది నాయకులు ఎన్నో ప్రగల్బాలు పలికి నిర్మిస్తామని మాయ వాగ్దానాలు చేసేవారని, ప్రజలను నమ్మబలికారని కానీ అధికారంలోకి వచ్చాక ఏమీ చేయలేదన్నారు. కానీ మార్గాని భరత్ రామ్ మోరంపూడి ఫ్లై ఓవర్ నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని అప్పటి కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి ఫ్లైవర్ నిర్మించారని అన్నారు. ఫ్లై ఓవర్ నిర్మాణం ముగిసిన తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రెండేళ్లు అయినా సర్వీస్ రోడ్లు నిర్మించలేకపోయారని, ఇది వారి చేతకానితనం కాదా అని ప్రశ్నించారు. ఇటీవల కాలంలో సర్వీస్ రోడ్లులో ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయన్న విషయాన్ని తెలుసుకొని గోతులను పుడ్చడానికి తాము వచ్చామన్నారు. ఇకనైనా ఈ కూటమి ప్రజాప్రతినిధులు కళ్ళు తెరిచి సర్వీస్ రోడ్లు నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దాది గౌరీశంకర్, వంశీ, శంకు సత్య రాజు, నల్లా రామాంజనేయులు, బూర స్వామి, దువ్వాడ గౌరీశంకర్, పి. సోను, నాని, సత్యం, యుఆర్ చిన్ని, మేడపాటి కృష్ణారెడ్డి, చీర్ల రాజకుమార్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# సోమాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీశ్రీశ్రీ శ్యామలాంబ అమ్మవారి ఉగాది జాతర మహోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం భక్తులకు, స్థానికులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. రాజమహేంద్రవరం సిటీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మజ్జి రాంబాబు హాజరై అన్నప్రసాద వితరణను ప్రారంభించారు. ఉగాది జాతర మహోత్సవాలను అత్యంత వైభవంగా, విజయవంతంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ధర్మకర్తల మండలి చైర్మన్, సభ్యులను ఆయన అభినందించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించడం అనందదా యకమన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ కడియాల వీరభద్రరావు, ఆలయ కార్యనిర్వాహణాధికారి జే వెంకటేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు అల్లాడ వెంకట అప్పారావు, బోను ఈశ్వరి, మల్లపు రెడ్డి వరలక్ష్మి , కురగంటి త్రినాథ్, కెల్లా జయలక్ష్మి, తాడివలస వెంకటలక్ష్మి, అండలూరి చంద్రశేఖర్, తోర్లపాటి శాలిని, కారుమూరి సురేష్, ఎక్స్ అఫీషియో మెంబర్ మాదిరెడ్డి పద్మావతి ఉత్సవాల విజయవంతానికి కృషిచేశారు. మార్చి మూడవ తేదీ నుండి ఉగాది జాతర మహోత్సవాలు ప్రారంభమయ్యాయని, అప్పటినుండి ప్రతిరోజు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్న తమకు సహకరించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, తెలుగుదేశం పార్టీ నాయకులకు, జనసేన నాయకులకు, బిజెపి నాయకులకు, భక్తులకు ఆలయ కార్యనిర్వాహణాధికారికి ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కడియాల వీరభద్రరావు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు చెల్లుబోయిన సూర్యనారాయణ, కడియాల శ్రీనివాస్, కడియాల శ్యాం పాల్గొన్నారు.

# తెలుగుదనాన్ని ప్రపంచానికి చాటినా మహా నేత ఎన్టీఆర్

## ప్రతి కార్యకర్తలకు పార్టీ సమూచిత స్థానం కల్పిస్తుంది - టిడిపి ఆవిర్భావ దినోత్సవంలో ఎమ్మెల్యే వేగుళ్ళ



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** తెలుగుదనాన్ని ప్రపంచానికి చాటి సంక్షేమ పథకాలను పరిచయం చేసినా దివంగత నేత ఎన్టీఆర్ అని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పేర్కొన్నారు. దేశ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించిన ఘనత కేవలం ఎన్టీఆర్ కు మాత్రమే దక్కుతుందని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం దినోత్సవం ఆయన ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో తొలుత పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ర్యాలీ గా మండపేట కరాచీ సెంటర్ కు చేరుకొని అక్కడ ఎన్టీఆర్ విగ్రహం కు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మండపేట రథం సెంటర్ లోని టిడిపి ప్రధాన కార్యాలయం లో నియోజకవర్గ స్థాయి టీడీపీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు విస్తృత సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వేగుళ్ళ జోగేశ్వరరావు మాట్లాడుతూ 44 ఏళ్ల క్రితం సరిగ్గా ఇదే రోజు దివంగత మాజీ ముఖ్య మంత్రి, తెలుగు వారి గుండె చప్పుడు దివంగత నందమూరి తారక రామారావు టిడిపి నీ స్థాపించారని చెప్పారు. ఆనాడు రాజకీయలు అంటే కేవలం పెద్దవారికి మాత్రమే తెలుసన్నారు. అలాంటి సమయాల్లో సాధారణ పేద ప్రజలు టిడిపి నీ అక్కున చేర్చుకొని ఎన్టీఆర్ కు బ్రహ్మరథం పట్టారన్నారు. అప్పటి నుండి ఇప్పటి వరకు పేదల పక్షాన నిలిచి టిడిపి పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. మహిళా లకు ఆస్తి లో సమాన వాటా, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు, బిసి, ఏసీ లకు అధిక ప్రాధాన్యత ఇచ్చింది కేవలం టీడీపీ మాత్రమే అన్నారు. వేరే ఎన్ని పార్టీలు ఉన్నా ప్రజలు ఆదరణ టిడిపి కి దక్కుతుందని చెప్పారు. ఈ దేశంలో సంక్షేమ రాజ్యానికి తెర తీసింది ఎన్టీఆర్ మాత్రమే అన్నారు. ఆయన బాట లో ముఖ్య మంత్రి చంద్ర బాబు నాయుడు, నారా లోకేష్ లు పార్టీ కోసం పనిచేస్తున్నారని కొనియాడారు. మండపేట నియోజక వర్గంలో తనను టిడిపి అభ్యర్థి గా నాలుగు సార్లు ప్రజలు ఆదరించారని పేర్కొన్నారు. మండపేట ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని ఆయన చెప్పారు. టిడిపి కార్యకర్తలకు అండగా ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, అంగర రామనరసింహమూర్తి, గుత్తుల రామకృష్ణ, చిర్ల వెంకటరెడ్డి, వల్లూరి నారాయణమూర్తి, దానేటి రమణ, ఉదయ భాస్కరరావు, కె.కృష్ణ రెడ్డి మోరంపూడి రాజ్ కుమార్, సత్తి శ్రీనివాస రెడ్డి, చుండ్రు వీర్రాజు, యండమూరి రామకృష్ణ పరమహంస, మేడపాటి రవీంద్ర, దాయం శేఖర్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, కపిలేశ్వరపురం మండల టీడీపీ అధ్యక్షులు బలవరెడ్డి సత్యనారాయణ, మండపేట మండల టీడీపీ అధ్యక్షులు కర్రి తాతారావు రాయవరం మండల టీడీపీ అధ్యక్షులు కొప్పిశెట్టి మాధవరావు, మండపేట పట్టణ అధ్యక్షులు మత్సా నాగబాబు రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ గడి సత్యవతి మండపేట మండల ఎంపిపి ఉండమట్ల వాసు,వాద ప్రసాదరావు, జొన్నపల్లి సూర్యారావు, షేక్ వల్లీ జానీ, షేక్ కరీం మూడు మండలాలు, టౌన్ లోని 30 వార్డులు నుండి కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రీజియన్ చైర్మన్ లయన్ గంగాధర్‌కు ఘన సత్కారం



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం లయన్ మాతురి రంగారావు లయన్స్ డిస్ట్రిక్ట్ 316డీ లీడర్‌షిప్ ఇన్‌స్టిట్యూట్‌లో లయన్స్ క్లబ్ రీజియన్-2 ఆధ్వర్యంలో "పుష్ప ధరహాసం" ప్రాంతీయ సదస్సు వైభవంగా నిర్వహించారు. ఆదివారం కోరుకొండ, రాజమహేంద్రవరం సరస్వతి విద్యాసంస్థల అధినేత, లయన్స్ రీజియన్ చైర్మన్ లయన్ పెనకాటి గంగాధర్ అధ్యక్షత "పుష్ప దరహాసం" కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిలుగా టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎర్రా వేణుగోపాల రాయుడు,గౌరవ అతిథిగా డిస్ట్రిక్ట్ గవర్నర్ సీనియర్ అడ్వకేట్ లయన్ వజ్రపు కోటేశ్వరరావు విచ్చేసి జ్యోతి ప్రజ్వలన గావించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పలు జిల్లాల ప్రముఖులు లయన్ క్లబ్ సేవలను, సామాజిక బాధ్యతలను ఎంతో బాధ్యతగా నిర్వహిస్తున్న పెనకటి గంగాధర్ పుష్పాంజలి దంపతులసేవలను పలువురు కొనియాడారు. లయన్ ఇవివి ఈశ్వర్ కుమార్ (ఇమ్మీడియట్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్)లయన్ చిట్నీడి శ్రీనివాసు (ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్)లయన్ పి ఉమా మహేశ్వరరావు (సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్)లయన్ దాసరి తిరుమలరావు (కీనోట్ స్పీకర్)లయన్ డాక్టర్ బాదం బాలకృష్ణ (గౌరవ ఆహ్వానితులు)వీరందరూ తమ ప్రసంగాల ద్వారా క్లబ్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను వివరించారు. పిఠాపురం, మండపేట,రాజమండ్రి, ధవలేశ్వరం, జగ్గంపేట తదితర లయన్స్ క్లబ్బుల నుండి విచ్చేసిన ప్రముఖులు లయన్ గంగాధర్ పుష్పాంజలి దంపతులను గజమాలతో ఘనంగా సత్కరిస్తూ, సాలువ వేసి మెమెంటోలు అందజేసి వారి సేవలను కొనియాడారు. పుష్పదరహాసం కార్యక్రమానికి గంగాధర్ సతీమణి పుష్పాంజలి తన చిరుదరహాసంతో పుష్పాదరహాసం కార్యక్రమానికే ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని పలువురు కొనియాడారు. సదస్సులో భాగంగా బ్యానర్ ప్రజెంటేషన్, అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగాయి. రాజమహేంద్రి సంస్కృతి లయన్స్ క్లబ్ ఈ కార్యక్రమానికి ఆతిథ్యం ఇచ్చింది. రీజియన్-2 పరిధిలోని పలువురు పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్లు, స్పెషల్ ఇన్వైటీలు,క్లబ్ సభ్యులు, సరస్వతి విద్యాసంస్థల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రాయవరంలో ఘనంగా మట్టల ఆదివారం వేడుకలు

## ఈస్టర్ పండుగకు ముందు ఆదివారం జరిగించే వేడుక - పుర వీధుల్లో ఈత మట్టలతో క్రైస్తవ విశ్వాసుల జయధ్వనులు





**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** రాయవరం మండలంలో క్రైస్తవ సోదరులు మట్టల ఆదివారం వేడుకలను వాడవాడలా భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈస్టర్ పండుగకు ముందు వచ్చే ఆదివారం జరుపుకునే ఈ ప్రత్యేక దినం, యేసుక్రీస్తు యెరూషలేములో విజయోత్సాహంగా ఊరేగించబడిన సందర్భాన్ని స్మరించుకుంటూ నిర్వహించబడుతుంది. బైబిల్ ప్రవచనాల ప్రకారం "మీ రాజు గాడిదనెక్కి రానున్నాడు" అనే వాక్యం నెరవేరిన సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ, విశ్వాసులు "దావీదు తనయ హోసన్నా", "యూదుల రాజా యేసన్నా" అనే నినాదాలతో ఆనందోత్సాహాలతో ఊరేగింపులు నిర్వహించారు. ఈ సందర్భంగా రాయవరం స్థానిక ఆర్సీఎం చర్చ్ పాస్టర్ ఎం. లాజరు మాట్లాడుతూ మట్టల ఆదివారం క్రైస్తవులందరికీ ఎంతో ఆధ్యాత్మిక ప్రాముఖ్యత కలిగిన రోజని యేసుక్రీస్తు వినయానికి, ప్రేమకు ఇది ప్రతీక. చిన్నారుల నుండి పెద్దల వరకు అందరూ కలిసి పాల్గొని గ్రామంలో క్రీస్తు సందేశాన్ని ప్రకటించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మరొక సంఘ కాపరి స్థానిక లూథరన్ చర్చ్ పాస్టర్ ఎం.గిరిబాబు మాట్లాడుతూ "ప్రవక్తలు చెప్పిన ప్రవచనాల నెరవేర్పును గుర్తుచేసుకుంటూ ఈ రోజు జరుపుకుంటామని, సండే స్కూల్ పిల్లలతో కలిసి ఈత మట్టలకు పువ్వులు గుచ్చి ఊరంతా ప్రదర్శన చేయడం ద్వారా క్రీస్తు ప్రేమను సమాజానికి తెలియజేయడం మా ముఖ్య ఉద్దేశ్యమన్నారు. సండే స్కూల్ చిన్నారులు ఈత మట్టలకు పువ్వులు గుచ్చి, మహిళలు, యువకులతో కలిసి ఆనందోత్సాహాలతో ఊరంతా ఊరేగింపులు నిర్వహించారు. క్రీస్తు కు జయమని నినాదాలు చేస్తూ, క్రీస్తు సందేశాన్ని ప్రచారం చేస్తూ పాల్గొన్న విశ్వాసులు తమ భక్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించి, అందరిలో ఐక్యతను పెంపొందించింది.

ఈనాడు ఎడిటర్‌పై

# వైసీపీ నాయకుల ఫిర్యాదు



**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని అవమానించే విధంగా కార్టూన్ ప్రచురించారని ఆరోపిస్తూ ఈనాడు యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని మండపేట నియోజకవర్గానికి చెందిన వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మండపేట టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును నియోజకవర్గ ఆర్టీఐ విభాగం అధ్యక్షుడు మందపల్లి రవికుమార్, మాజీ కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్, సోషల్ మీడియా అధ్యక్షుడు జొన్నపల్లి సత్తిబాబు, టౌన్ వైసీపీ కార్యదర్శి పొలమాల సత్తిబాబు, గెల్ల బేబి కేదారనాథ్ తదితరులు కలిసి పోలీసులకు అందజేశారు. జగన్ మోహన్ రెడ్డి పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగించే ఉద్దేశ్యంతోనే ఈ కార్టూన్ చిత్రీకరించబడిందని వారు ఆరోపించారు. కార్టూన్ గీసిన వ్యక్తి మాకిరెడ్డి, ఈనాడు ఎడిటర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు.

# కార్యకర్తల ఆదరిస్తూ తెలుగు దేశం పార్టీ దేశంలోనే ఆదర్శంగా నిలుస్తుంది





### మండలంలోని ప్రతి గ్రామాలలో తేదేపా ఆవిర్భావ వేడుకలు

**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** మండలంలోని అన్ని గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. పార్టీ కార్యకర్తలు ఉత్సాహంగా కార్యక్రమాలు నిర్వహిస్తూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతోందని పేర్కొన్నారు. కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ, ప్రజలకు సేవ చేయడంలో ముందుండే ఆదర్శప్రాయ పార్టీగా తెలుగుదేశం పార్టీ నిలుస్తుందని కొనియాడారు. రాయవరం మండలం వెదురుపాక సావరం గ్రామంలో గ్రామ శాఖ అధ్యక్షులు రాయుడు ప్రసాద్, వెదురుపాక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు పిల్లి గణేష్ ఆధ్వర్యంలో పార్టీ వ్యవస్థాపకులు, దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రం రాయవరంలో గ్రామ శాఖ అధ్యక్షులు కోట వెంకటరమణ ఆధ్వర్యంలో దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావుతో పాటు మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి మూలారెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీలో సీనియర్ నాయకులను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు కలెక్టర్ ఆధ్వర్యంలో

# ప్రజా సమస్యల పరిష్కార వేదికగా మున్సిపాలిటీ



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మున్సిపల్ కార్యాలయంలో నేడు నిర్వహించనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి హాజరుకానున్నారని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. కార్యాలయ ఆవరణలో ఉదయం 10 గంటలకు గ్రీవెన్స్ కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ స్వయంగా హాజరై, ప్రజల నుంచి వచ్చే అర్జీలను పరిశీలించి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. కలెక్టర్ సమక్షంలో గ్రీవెన్స్ నిర్వహించబడుతుందని చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.


కోరుకొండలో ఘనంగా తెలుగుదేశం పార్టీ

# 44వ ఆవిర్భావ వేడుకలు : బొడ్డు

## యుగపురుషుడి సేవలు అద్వితీయం



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు రాజానగరం మండలంలోనీ ప్రతి గ్రామంలో తెలుగు తమ్ముళ్లు ఘనంగా నిర్వహించారని రాజమహేంద్రవరం రుడా చైర్మన్ తెలుగుదేశంపార్టీ జిల్లా అధ్యక్షులు బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు. ఆదివారం తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా కోరుకొండ తెదేపా కార్యాలయంలో పార్టీ జెండా ఎగరవేసి, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బొడ్డు మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవాన్ని యావత్ ప్రపంచానికి వెలుగెత్తి చాటిన మహనీయుడు స్వర్గీయ ఎన్టీఆర్ అని కొనియాడారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా పుట్టిన తెలుగుదేశం పార్టీ, నేడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా దూసుకు పోతోందన్నారు. అనంతరం భారీ కేక్‌ను కట్ చేసి,మిఠాయిలు పంచుకున్నారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని చౌదరి పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులను ఘనంగా సత్కరించారు. కోరుకొండ మండలం లోని అన్ని గ్రామాల్లో తెలుగు తమ్ముళ్లు ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలు వేసి, ఘనంగా నివాళు లర్పించి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు గంగిశెట్టి చంటిబాబు, తనకాల నాగేశ్వరరావు, నూనె వెంకన్న, అడపా వీరబాబు, రొంగల శ్రీనివాస్, దూది కాంతారావు, కొయ్యే సామ్యూల్, తెలగంశెట్టి శ్రీనివాస్, పరస శ్రీను, పలు గ్రామాల తెదేపా నాయకులు, తెలుగు తమ్ముళ్లు పాల్గొన్నారు.

రావులపాలెంలో ఘనంగా

# టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**అధినేతల అడుగుజాడల్లో.. పార్టీ ప్రతిష్ఠను మరింత పెంచుదాం**



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగు వారి ఆత్మగౌరవ ప్రతీక అయిన తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు రావులపాలెం క్యాంపు కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, యువ నాయకులు బండారు సంజీవ్ తదితరులు పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఇదే వేదికపై, పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన సీనియర్ కార్యకర్తలను దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యువనేత బండారు సంజీవ్ మాట్లాడుతూ అధినేత నారా చంద్రబాబునాయుడు యువ నాయకులు నారా లోకేష్ వారి నాయకత్వంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలని, సమిష్టి కృషితో పార్టీని ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్దామని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొన్నారు.

మంత్రి సుభాష్ సమక్షంలో

# 15 మంది తెలుగుదేశం పార్టీలో చేరిక

**టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవం రోజున పార్టీలో చేరికలు ఆహ్వానించిన మంత్రి సుభాష్, పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం**



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు మోకాన అంబేద్కర్‌తో పాటు మరో 14 మంది మంత్రి వాసంశెట్టి సుభాష్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్, వాసంశెట్టి సత్యం, అక్కల రిశ్వంత్ రాయ్‌లు వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం రోజున పార్టీలో చేరడం ఆనందంగా ఉందని పార్టీలో చేరిన వారు తెలిపారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి, సామాజిక సేవా కార్యక్రమాలకు ఆకర్షితులమై పార్టీలో చేరుతున్నట్టు వారు వెల్లడించారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని పార్టీ బలోపేతానికి కృషి చేసి, పార్టీకి మంచి పేరు తీసుకురావాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ సూచించారు. పార్టీలో మోకాన అంబేద్కర్, పి వరప్రసాద్, బత్తుల సత్యనారాయణ, పిల్లి రాజు, పిల్లి పెదరాజు, రొక్కల పెంటయ్య, వారారాజు, తాతపూడి కొండ, కోవల విశ్వనాథం, పలివెల లాజర్, పలివెల చిన్నబ్బి, కత్తుల రాజు, కత్తుల నాగేశ్వరరావు, బరగట్ల నారాయణ గాంధీ తదితరులు చేరారు.

# జర్నలిస్టులకు పెన్షన్, రక్షణ చట్టం అవసరం

**టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం**



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన మీడియా రక్షణకు ప్రత్యేక చట్టం అవసరం జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సంఘటిత శక్తే ఏకైక మార్గం జర్నలిస్టులకు పెన్షన్, రక్షణ చట్టం అవసరం టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం సమాజంలో వ్యక్తులుగా సాధించలేని సమస్యలను సంఘటిత శక్తితోనే పరిష్కరించుకోవచ్చని రెడ్డి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ మరియు ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమలాపురం కిమ్స్ ఆసుపత్రి వద్ద నిర్వహించిన జిల్లా ప్రథమ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పూర్వీకులు సంఘాలను స్థాపించడం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం సామాజిక సమస్యలపై సమష్టిగా పోరాడటమేనని గుర్తుచేశారు. జర్నలిస్టులకు ఎదురవుతున్న వృత్తిపరమైన సవాళ్లకు ఈ సంఘాలు ఒక రక్షణ కవచంలా పనిచేస్తాయని ఆయన అన్నారు.?ప్రజాస్వామ్యంలో చట్టాలు చేయడానికి లెజిస్లేచర్ వ్యవస్థ దానిని అమలు చేయడానికి ఎగ్జిక్యూటివ్ వ్యవస్థ,వీటిని పర్యవేక్షించడానికి జ్యుడీషియల్ వ్యవస్థ ప్రజలకు అందించడానికి మీడియా వ్యవస్థ నాలుగు స్తంభాలుగా ఉన్నాయని వివరించారు.క్షేత్రస్థాయిలో పనిచేసే జర్నలిస్టుల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడటం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ముఖ్యంగా జర్నలిస్టుల పెన్షన్ సమస్యపై స్పందిస్తూ, ప్రభుత్వం చిత్తశుద్ధితో తలచుకుంటే ఇది చాలా చిన్న విషయమని అభిప్రాయపడ్డారు.రాష్ట్రవ్యాప్తంగా సుమారు వెయ్యి మంది జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించడం ప్రభుత్వానికి పెద్ద భారమేమీ కాదన్నారు. గీత కార్మికుల వంటి ఇతర రంగాల వారికి 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తున్న విషయాన్ని గుర్తు చేస్తూ, జర్నలిస్టులకు కూడా వయోపరిమితి విషయంలో తగిన నిర్ణయం తీసుకోవాలని, 58 ఏళ్లకు పెన్షన్ ఇచ్చేలా జర్నలిస్టుల అసోసియేషన్లతో చర్చించి చర్యలు చేపట్టాలని కోరారు.

**రక్షణ, చట్టం, భద్రత**

జర్నలిస్టుల భద్రత గురించి మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ మరియు బీసీ వర్గాలకు ఉన్నట్టే, జర్నలిస్టుల కోసం కూడా ఒక బలమైన ప్రత్యేక రక్షణ చట్టం రూపొందించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అలాగే జర్నలిస్టుల పిల్లల చదువులకు,వారి కుటుంబాల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం తగిన ప్రాధాన్యతనిచ్చి సహాయం అందించాలని డిమాండ్ చేశారు. మీడియా సంస్థల యజమానులు ఆర్థికంగా ఎదుగుతున్నా, జర్నలిస్టుల పరిస్థితి మాత్రం ఆందోళనకరంగా ఉందని, వారిపై యాజమాన్యాల ప్రభావం ఎక్కువగా ఉండటం వృత్తిపరమైన సవాలుగా మారిందని పేర్కొన్నారు.?రాజకీయాలకు అతీతంగా వైఎస్సార్సీపీ, టీడీపీ, కాంగ్రెస్, జనసేన వంటి అన్ని పార్టీల వారు ఒకే వేదికపైకి రావడం ఈ సంఘం యొక్క గొప్పతనాన్ని చాటుతోందని రెడ్డి సుబ్రహ్మణ్యం కొనియాడారు. జర్నలిజం మీద ఉన్న మక్కువతో చాలామంది వేరే వ్యాపారాలు చేసుకోలేక, పూర్తి సమయం దీనికే కేటాయించడం వల్ల కుటుంబ పోషణ కష్టంగా మారుతోందని ఆయన గుర్తుచేశారు. జర్నలిస్టుల సమస్యలపై అసోసియేషన్ తరపున మెమోరాండం అందజేస్తే, దానిని సంబంధిత మంత్రి మరియు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. నిస్వార్థంగా పనిచేస్తున్న సంఘ నాయకులను ఆయన మనస్ఫూర్తిగా అభినందించారు.

# ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ పదిలం

**దేశంలోనే మొదటిసారి మహిళలకు ఆస్తిలో సమానహక్కు - ఎన్టీఆర్ స్ఫూర్తితో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు పాలన**
**ఊపిరి ఉన్నంతవరకు తెలుగుదేశం పార్టీలోనే ఉంటా.. - సమగ్ర ప్రణాళికతో ఆదర్శ నియోజకవర్గంగా రామచంద్రపురం**
**ఎన్టీఆర్ హయాంలో మహిళాభ్యున్నతికి బాటలు - రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్**
**రామచంద్రపురం నియోజకవర్గంలో అత్యంత వైభవంగా టిడిపి పార్టీ 44వ ఆవిర్భావ వేడుకలు**



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** సమాజమే దేవాలయం - ప్రజలే దేవుళ్లు అనే నినాదంతో స్వర్గీయ ఎన్టీఆర్ తెలుగుదేశం స్థాపించి, పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ 44 వ ఆవిర్భావ వేడుకలు రామచంద్రపురం నియోజవర్గంలో కనుల పండుగగా నిర్వహించి స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి ఘన నివాళులు అర్పించారు. తొలిత రామచంద్రపురం బైపాస్ రోడ్డులో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి మంత్రి సుభాష్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ వెంకీ అన్నపూర్ణ, మసేను వెంకన్న(రేవు శీను) పలువురు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఆధ్వర్యంలో స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. అనంతరం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో మంత్రి సుభాష్ పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. పేదల అభ్యున్నతి కోసం స్వర్గీయ ఎన్టీఆర్ అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేశారన్నారు. పేదలకు పట్టెడన్నం పెట్టేందుకు రూ.2 కే కిలో బియ్యం పథకం ప్రవేశపెట్టిన మహనీయుడని, మగవారితో సమానంగా మహిళలకు ఆస్తిలో హక్కు, రిజర్వేషన్ లు కల్పించారన్నారు. సంక్షేమ పథకాలకు ఆధ్యుడైన ఎన్టీఆర్ స్ఫూర్తితో ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో ఆదర్శ పాలన సాగిస్తున్నారన్నారు. డ్వాక్రా స్థాపించి మహిళల ఆర్థిక అభ్యున్నతికి బాటలు వేశారు. పేదలకు పట్టెడన్నం పెట్టాలనే ఉద్దేశంతో అన్న క్యాంటీన్లు ప్రవేశపెట్టారని అన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 2027 నాటికి బహుళ సార్థక పోలవరం ప్రాజెక్టు పూర్తవుతోందని అన్నారు.

**ఊపిరి ఉన్నంతవరకు తెలుగుదేశం పార్టీలోనే.. మంత్రి లోకేష్ టీమ్‌లోనే..**

ఊపిరి ఉన్నంతవరకు తెలుగుదేశం పార్టీలోనూ, మంత్రి నారా లోకేష్ టీమ్‌లో కొనసాగుతా అని మంత్రి సుభాష్ పేర్కొన్నారు. 27 వేల ఓట్ల భారీ మెజారిటీతో గెలిపించిన రామచంద్రపురం ప్రజల రుణం తీసుకుంటా అన్నారు. భవిష్యత్తులో కోటిపల్లి- ముక్తేశ్వరం రోడ్డు బ్రిడ్జి సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. అలాగే కోనసీమకు రైల్వే కూత వినిపించేలా ఎంపీ హరీష్ తో కలిసి కృషి చేస్తున్న అన్నారు.

**రామచంద్రపురంకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీకు కృషి**

రామచంద్రపురం పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేనందున సుమారు 40 నుంచి 50 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని మంత్రి సుభాష్ హామీ ఇచ్చారు. ఇప్పటికే నియోజకవర్గానికి 220 కోట్లుతో అభివృద్ధి చేశామని, అభివృద్ధి నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తామన్నారు.

**సభలో కన్నీటి పర్యంతమైన మంత్రి సుభాష్**

సమావేశంలో మంత్రి సుభాష్ కన్నీటి పర్యంతమైన సంఘటన చోటు చేసుకుంది. ద్రాక్షారామం కు చెందిన వాసంశెట్టి శివకుమార్ తన కుమార్తె శరణ్య (15 సంవత్సరాలు ) చిన్నతనంలోనే క్యాన్సర్ వ్యాధికి గురయ్యారు. చివరి దశలో క్యాన్సర్ అని తెలిసినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. శరణ్య ఇటీవల అకాల మరణం చెందింది. ఈ విషయాన్ని శరణ్య తండ్రి వేదిక పైకి వచ్చి మంత్రికి చెప్పడంతో మంత్రి సుభాష్ కన్నీటి పర్యంతమయ్యారు. ఇలాంటి నిస్సహాయ పరిస్థితి ఏ కుటుంబంలోనూ రాకుండా తాను కృషి చేస్తానని కంట నీరు పెట్టుకున్నారు. క్యాన్సర్ వ్యాధితో, గుండెపోటు మరణాలతో ఏ ఒక్కరూ చనిపోకూడదనే బలమైన ఆశయంతో రామచంద్రపురం నియోజవర్గంలో మూడు కంటైనర్ ఆస్పత్రులు, నాలుగు ఎలక్ట్రికల్ ఆటోలు, డాక్టర్ ఆన్ వీల్ పేరుతో ఒక సంచార వైద్యశాలను ఏర్పాటు చేశామన్నారు.

**కార్యకర్తలను సన్మానించిన మంత్రి సుభాష్**

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ జెండా మోస్తూ పనిచేస్తున్న సీనియర్ కార్యకర్తలను రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు 12 మందిని మంత్రి సుభాష్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, తెలుగుదేశం పార్టీ పెద్దల సమక్షంలో ఘనంగా సత్కరించారు. ప్రశంసా పత్రం, జ్ఞాపిక, దుశాలువాతో సత్కరించి వారి అనుభవాలు సభలో పంచుకున్నారు.

**కార్యకర్తలతో మంత్రి సుభాష్ సహపంక్తి భోజనాలు**

టిడిపి 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక పార్టీ కార్యాలయంలో మంత్రి సుభాష్ కార్యకర్తలకు విందు ఇచ్చారు. సభ అనంతరం కార్యకర్తలతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం పట్టణ, రామచంద్రపురం రూరల్, కాజులూరు, కె గంగవరం మండలాల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఉండవల్లి శివ, కొత్తపల్లి శ్రీనుబాబు, చవ్వాకుల నారాయణమూర్తి, మేడిశెట్టి రవికుమార్, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ పెంకే అన్నపూర్ణ, స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్, రేవు శ్రీను, ద్రాక్షారామం సర్పంచ్ కొత్తపల్లి అరుణ, నియోజవర్గం మహిళ అధ్యక్షురాలు జాస్తి విజయలక్ష్మి, బళ్ల లక్ష్మి, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

కొత్తపేట నియోజక వర్గం

# తెదేపా 44 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే బండారు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగు వారి ఆత్మగౌరవ ప్రతీక తెలుగుదేశం పార్టీ తెలుగు జాతి ఉన్నంతవరకూ తెదేపా ప్రస్థానం కొనసాగుతుంది.ముఖ్యమంత్రి చంద్రబాబు,మంత్రి నారా లోకేషల సారథ్యంలో ప్రజాసేవే పరమావధిగా ముందడుగు.తెలుగు జాతి ఉన్నంతవరకు తెదేపా ప్రస్థానం కొనసాగుతుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీకగా అన్న ఎన్టీఆర్ నిలిస్తే, ఆత్మవిశ్వాసానికి ప్రతిరూపంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, భవిష్యత్తు రాజకీయాలకు దిక్సూచిగా మంత్రి నారా లోకేష్ వ్యవహరిస్తున్నారని వారిరువురి సారథ్యంలో తెలుగుదేశం పార్టీ నవోత్సాహంతో ముందడుగు వేస్తుందన్నారు. తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ముందుగా వాడపాలెం సెంటర్ లో పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు అన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తరువాత కొత్తపేట బస్టాండ్ సెంటర్ లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రావులపాలెం క్యాంప్ కార్యాలయం వద్దకు చేరుకుని తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆకుల రామకృష్ణ,యువ నాయకులు బండారు సంజీవ్ మరియు తెలుగుదేశం నాయకులతో కలిసి టిడిపి జెండా ఆవిష్కరించారు.అన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.టిడిపి ప్రస్థానంపై ఏర్పాటు చేసిన ఆడియో, వీడియో ప్రదర్శన వీక్షించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ తెలుగుజాతి ఆత్మగౌరవం దశదిశలా వ్యాప్తి చేయడమే లక్ష్యంగా 1982లో ఇదే రోజున అన్న ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారని ఎమ్మెల్యే బండారు అన్నారు. రాజకీయం అంటే అధికారం అనుభవించడం కాదని ప్రజలకు సేవ చేయడమేనని అన్న ఎన్టీఆర్ చాటారని, దేశ రాజకీయాల్లో సంక్షేమ పాలన, సుపరిపాలనకి మార్గం వేసారని బండారు అన్నారు.బడుగు,బలహీన వర్గాల ప్రజలు కేవలం ఓటర్లుగా మిగిలిపోకుండా రాజకీయాలను శాసించే స్థాయికి వెళ్లేలా ఇటు పార్టీలోనూ,అటు పాలనలోనూ పదవులు ఇచ్చారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని, చేస్తున్నారన్నారు. యువ నాయకులు నారా లోకేష్ తెలుగుదేశం కార్యకర్తలకు సొంత అన్నలా చేదోడుగా నిలుస్తున్నారని, పార్టీ నాయకులు, కార్యకర్తలను సొంత కుటుంబ సభ్యుల్లా ఆదరిస్తున్నారని కొనియాడారు. మనం చేసే పని ఏదైనా పార్టీ గౌరవం, నాయకుని గౌరవం పెంచే విధంగా పాటుపడదామన్నారు. అనంతరం పార్టీ కార్యకర్తలు,నాయకులతో కలిసి టీడీపీ ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు.పార్టీ కోసం అత్యుత్తమ పనితీరును కనబరిచిన నాయకులను, కార్యకర్తలను సన్మానించారు. తదుపరి భారీ కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు.టిడిపి ఆవిర్భావ దినోత్సవానికి సంబంధించిన కరపత్రాలను కార్యకర్తలకు అందజేశారు. అనంతరం వారందరితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వయంగా నాయకులకు,కార్యకర్తలకు భోజనం వడ్డించి ఆప్యాయంగా పలకరించారు.

# పసుపు జెండా క్రింద ఉండటం మన పూర్వజన్మ సుకృతం : అమూల్య



**రాజోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** సమాజమే దేవాలయం! ప్రజలే దేవుళ్ళు అనే నినాదంతో స్థాపించిన తెలుగుదేశం పార్టీ 44 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాజోలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ శ్రీమతి గొల్లపల్లి ఆధ్వర్యంలో మొదటిగా రాజోలు టౌన్ లోని తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వర్యులు స్వర్గీయ శ్రీ నందమూరి తారక రామారావు గారి విగ్రహానికి నియోజకవర్గ పార్టీ శ్రేణులు, ఎన్టీఆర్ అభిమానులు, కలిసి ఎన్టీఆర్ విగ్రహానికి గజమాలవేసి నివాళులర్పించారు అనంతరం పార్టీ జెండా ఆవిష్కరించి కేక్ కటింగ్ చేసి ఒకరికొకరు పార్టీ ఆవిర్భావ దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ శ్రీమతి గొల్లపల్లి అమూల్య ఆధ్వర్యంలో తాటిపాక జివిస్ గార్డెన్స్ నందు వారి కార్యాలయం వద్ద పార్టీ జెండా ఆవిష్కరించి తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రివర్యులు స్వర్గీయ శ్రీ నందమూరి తారక రామారావు గారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి సభాస్థలి వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు వారి సందేశం ఇచ్చి పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నాయకులు కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలియజేశారు. అమూల్య మాట్లాడుతూ అన్న నందమూరి తారక రామారావుకి కావలసినంత పేరు ప్రఖ్యాతలు ఆస్తిపాస్తులు ఉన్నా కూడా పేద ప్రజల కోసం వారు పడుతున్న ఇబ్బందులను చూసి రాష్ట్రంలోని ప్రతి పేదవాడికి తినడానికి తిండి, కట్టుకోవడానికి బట్టా, ఉండడానికి ఇల్లు ఏర్పాటు చేయాలనే సంకల్పంతో తెలుగుదేశం పార్టీని స్థాపించిన అన్న ఎన్టీఆర్ పార్టీ స్థాపించిన తొమ్మిది నెలల లోనే అధికారంలోనికి వచ్చి పేద ప్రజల కోసం రెండు రూపాయలకే కిలో బియ్యం పథకం ప్రవేశపెట్టి పెట్టడం అన్నం పెట్టి రాష్ట్ర ప్రజల అందరి మన్నన పొందిన మహానుభావుడు అన్న ఎన్టీఆర్ అన్నారు. అనంతరం డిజిటల్ స్క్రీన్ పై మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని నియోజకవర్గ పార్టీ శ్రేణులతో కలిసి వీక్షించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు ఏవి సూర్యనారాయణ రాజు, రాజోలు మాజీ ఇన్చార్జ్ బత్తుల రాము, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ భూపతిరాజు సాయిబాబా రాజు, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు చిటికెల రామ్మోహన్ రావు, రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ముదునూరి చినబాబు రాజు, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ శ్రీమతి బందెల పద్మ, రాష్ట్ర మహిళా కార్యదర్శి శ్రీమతి మంగెన భూదేవి, రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి గెడ్డం సింహ, రాష్ట్ర పార్టీ మీడియా కోఆర్డినేటర్ బోళ్ళ సతీష్ బాబు, గోదావరి డెల్టా ప్రాజెక్ట్ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు మొల్లేటి శ్రీనివాస్, లంకే శ్రీనివాసరావు, జిల్లా పార్టీ కార్యదర్శి రాపాక నవరత్నం, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి శ్రీమతి అడబాల రమాదేవి, జిల్లా పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీమతి చెల్లింగి సీతామహాలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షులు బోణం బాబు, అనుచూరి సునీత రామ పురుషోత్తం, అడబాల సాయిబాబా, తాడి సత్యనారాయణ, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు గొనిపాటి రాజు తెలుగు మహిళలు, వివిధ గ్రామాల సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్ష కార్యదర్శులు, వివిధ హోదాలలోన నాయకులు, అన్న నందమూరి అభిమానులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

బాణాసంచా మందులను తయారుచేసే

# వ్యక్తిపై కేసు నమోదు

**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కొత్తపేట పోలీస్ స్టేషన్ ఎస్ఐకి రాబడిన సమాచారం పై మోడేకూరు చర్చి పేట దగ్గర ఎటువంటి అనుమతులు లేకుండా బాణాసంచా మందులను తయారుచేసి విక్రయిస్తున్నారు అనే సమాచారంపై ఎస్సై వారి సిబ్బంది మరియు విఆర్ఓ మరియు వీఆర్ఏ కలిసి మోడేకూరు గ్రామం చర్చి పేట యార్లగడ్డ రామకృష్ణ వద్ద నుండి మందు గుండు సామాను తయారు చేయడానికి ఉపయోగించే ముడి సరుకు మరియు తయారుచేసిన నిల్వ ఉంచిన బాణసంచా సామాగ్రిని ఎస్ఐ స్వాధీనం చేసుకుని సదరు యార్లగడ్డ రామకృష్ణ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాట్టు తెలియజేశారు.

# ఘనంగా మట్టల ఆదివారం



**ఆలమూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** మండల పరిధిలో గ్రామాల్లో క్రైస్తవులు అత్యంత భక్తి శ్రద్ధలతో మట్టల ఆదివారాన్ని జరుపుకున్నారు. ప్రభువైన క్రీస్తుకు శిలువ వేసే ముందు ఆదివారాన్ని మట్టల ఆదివారం పర్వదినంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. మానవజాతికి మోక్షాన్ని ప్రసాదించి జయ ప్రవేశం కల్పించే దినంగా మట్టల ఆదివారం విశిష్టత కలిగి ఉంది. దేవుని పట్ల పరిపూర్ణ విశ్వాసం ఉంచి క్రీస్తు బోధనలను ఆచరిస్తూ దైవ ప్రార్థనలో క్రైస్తవులు తరించారు. అందులో భాగంగా క్రై స్తవులు ఈతమట్టలు చేతబూని గ్రామ, పుర వీధుల్లో బారీ ర్యాలీలు నిర్వహించారు.

చింతలూరు శ్రీ నూకంబికా అమ్మవారిని దర్శించుకున్న

# జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్



**ఆలమూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలం పరిధిలో చింతలూరు శ్రీ నూకంబికా అమ్మవారి తీర్థ మహోత్సవాలలో భాగంగా నూకాంబికా అమ్మవారిని ఆదివారం కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ దర్శించుకున్నారు. ఆయనకు వేద పండితులు ఆలయ కమిటీ చైర్మన్ వీరి అప్పారావు గౌడ్, సొసైటీ చైర్మన్ నల్ల వెంకన్న, కూటమి సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ కోనసీమ జిల్లా

# అసోసియేషన్ సెక్రటరీగా వాకాడ బాబులు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఏపీ డబ్ల్యూ జె ఎఫ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అసోసియేషన్ సెక్రటరీగా వాకాడ బాబులు ఏకగ్రీవంగా పదవినీ అప్పగించిన రాష్ట్ర నాయకులకు జిల్లా కార్యవర్గ సభ్యులకు తోటి జర్నలిస్ట్ సోదరులకు పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.


రావులపాలెంలో ఘనంగా

# టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**అధినేతల అడుగుజాడల్లో.. పార్టీ ప్రతిష్ఠను మరింత పెంచుదాం**





**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగు వారి ఆత్మగౌరవ ప్రతీక అయిన తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు రావులపాలెం క్యాంపు కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ , యువ నాయకులు బండారు సంజీవ్ తదితరులు పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఇదే వేదికపై, పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన సీనియర్ కార్యకర్తలను దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యువనేత బండారు సంజీవ్ మాట్లాడుతూ అధినేత నారా చంద్రబాబు నాయుడు యువ నాయకులు నారా లోకేష్ వారి నాయకత్వంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలని, సమిష్టి కృషితో పార్టీని ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్దామని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షునిగా

# మట్టపర్తి శ్రీనివాస్





**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం కిమ్స్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్ ) డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కమిటీ ఎన్నికలలో జిల్లా అధ్యక్షునిగా మట్టపర్తి శ్రీనివాస్ (అంబాజీపేట సాక్షి రిపోర్టర్ ) ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా పేపకాయల రాజు (అంబాజీపేట కోస్తావాణి) ప్రతినిధిలు ఏకగ్రీవంగా ఎంపిక అయ్యారు.





### ప్లాస్టిక్ రహిత పల్లెల లక్ష్యంగా

# "స్వచ్ఛ రథం" తొలి అడుగులు...!

**గ్రామాల్లో వ్యర్థాల సేకరణా "స్వచ్ఛ రథం" ప్రారంభం - మండలానికి ఒక రథం కేటాయింపు**
**నాటి ఎండియు వాహనాలే నేటి స్వచ్ఛ రథాలు**



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గ్రామాలను ప్లాస్టిక్ వ్యర్థాలు, కాలుష్య రహితంగా, పర్యావరణ హితంగా తీర్చిదిద్దేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆ వినూత్న పథకమే 'స్వచ్ఛ రథం'. స్వచ్ఛ రథం' పేరుతో ఏర్పాటు చేసిన వాహనాల ద్వారా ప్రతీ గ్రామంలోని ప్రతీ ఇంటి నుండి ప్లాస్టిక్ వస్తువులు, ఇనుము, అట్ట పెట్టెలు, పాత కాగితాలు, ఈ-వ్యర్థాలు, ఇతర పనికిరాని వస్తువులను తీసుకుని దానికి బదులుగా గృహాలకు అవసరమైన నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ఇది పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు, ప్రజలు తమ వ్యర్థాలను కూడా ఉపయోగకరమైన వస్తువులుగా, ఆదాయ వనరుగా మార్చుకునేందుకు దోహద పడుతుంది. పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో 'స్వచ్ఛ రథా'లను ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండలాలకూ, మండలానికి ఒకటి చొప్పున కేటాయించారు. ఈ రథాలు వారానికి ఒకసారి గ్రామాలకు వచ్చి ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు, గాజు సీసాలు, పేపర్లు, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, ఇనుము, స్టీల్, పాత పుస్తకాలు సేకరిస్తాయి. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు ఈ స్వచ్ఛరథం' పథకానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధిశాఖ కమిషనర్ కృష్ణతేజ శ్రీకారం చుట్టారు. ఐతే గ్రామాల్లోని ప్రజలకు వీధులు, రోడ్లు, మురుగు కాలువలు, సామాజిక స్థలాల పరిశుభ్రతను అలవాటు చేయడం, గ్రామాల్లో వ్యర్థాలను, వ్యర్థ పదార్థాలు, ఈ-వేస్ట్ ను తగ్గించడం, పర్యావరణ పరిరక్షణ ముఖ్య లక్ష్యంగా ఈ పథకం కొనసాగ నున్నది. గతంలో తెలుగుదేశం ప్రభుత్వంలో ఘన వ్యర్థాల నిర్వహణ కోసం షెడ్డుల నిర్మాణాలు చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా 10,000 లకు పైగా ఘన వ్యర్థాల షెడ్డులను నిర్మించారు. తెచ్చిన చెత్తను వేరు చేసి వర్మి కంపోస్టుగా మార్చి రైతులకు విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే, వైసీపీ హయాంలో ఈ ప్రక్రియను పక్కన పెట్టేశారు. తిరిగి కూటమి ప్రభుత్వం వచ్చాక.. వినూత్న ఆలోచనతో ముందుకు సాగాలని నిర్ణయించింది.

**నాటి ఎండియు వాహనాలే నేటి స్వచ్ఛ రథాలు...**

ఈ నేపథ్యంలో తడి, పొడి చెత్తతో పాటు నిరుపయోగమైన ప్లాస్టిక్ తదితర వ్యర్థాల సేకరణ కోసం ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా పంపిణీ వ్యవస్థ చౌకధరల దుకాణాలకు అదనంగా ఏర్పాటు చేసిన మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ) లను ఎన్.డి.ఎ. రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. రేషన్ షాపులకు నేరుగా లబ్ధిదారులే వచ్చి సరుకులను తీసుకునే పాత విధానాన్నే పునరుద్ధరించింది. ఈ క్రమంలో ఆ వాహనాల ఆపరేటర్లకు ఉపాధి కల్పించడంతో పాటు ప్లాస్టిక్ తదితర వ్యర్థాలను సేకరించేందుకు వాటిని వినియోగించాలని నిర్ణయించారు. ఈ వాహనాలకు నెలకు రూ.25,000 లు చొప్పున చెల్లించి వ్యర్థాలను తరలించేలా చర్యలు తీసుకున్నారు. ప్రజల నుంచి సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాలను బయట మార్కెట్‌లో విక్రయించి.. దానికి సరిపడా నిత్యావసర వస్తువులు తెచ్చుకునే బాధ్యత ఎండీయూ ఆపరేటర్లపై ఉంచారు. ఈ ప్రాజెక్టు వల్ల పంచాయతీలకు, ప్రభుత్వానికి ఆర్థిక భారం ఉండదు. 15 వ ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలు స్వచ్ఛ రథం కోసం వాడుకోవచ్చు.

**స్వచ్ఛ రథాలు తీసుకునేవీ ... ఇచ్చేవి ఇవే ...!**

'స్వచ్ఛ రథం' వద్ద ప్రజల నుంచి పనికిరాని వాటర్ బాటిళ్లు, పాలిథీన్ సంచులు, పాడైన ప్లాస్టిక్ వస్తువులు, పాత ఇనుము, పేపర్లు, పుస్తకాలు, అట్ట పెట్టెలు, ప్లాస్టిక్, గాజు సీసాలు, స్టీల్, అల్యూమినియం వస్తువులను తీసుకుంటారు. ఇంట్లో పనికిరాని వస్తువులను బహిరంగ ప్రదేశాల్లో పడేయకుండా స్వచ్ఛరథం ద్వారా సేకరిస్తున్నారు. ఈ వ్యర్థాలు తీసుకుని వాటికి విలువను నిర్ణయించి బదులుగా నిత్యావసరాలైన పప్పు, ఉప్పు, చింతపండు, కొబ్బరినూనె, సర్ఫ్ ప్యాకెట్, బట్టల సబ్బులు, ఒంటి సబ్బులు, టీ, కాఫీ పౌడర్లు, లేస్ ప్యాకెట్లు, పేస్ట్, షాంపూ ప్యాకెట్లు, ఉల్లిపాయలు, టూత్ బ్రష్‌లు, పెన్నులు, పెన్సిళ్లు, గోధుమ పిండి, వేరుశనగ గుళ్లు, మినపగుళ్లు, కందిపప్పు తదితర నిత్యావసరాలు ఇస్తున్నారు. 1 కేజీ ప్లాస్టిక్‌కి రూ.20 చొప్పున విలువ నిర్ణయించి నగదుకు బదులుగా సరుకులు ఇవ్వనున్నారు. దీంతో ఈ స్వచ్ఛ రథం పథకం కార్యక్రమం ద్వారా వ్యర్థాలను కూడా ఆదాగా మార్చుకోవచ్చు. కాగా కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలానికి సంబంధించిన స్వచ్ఛ రథంను శంఖవరంలోని మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో ఆదివారం మధ్యాహ్నం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రారంభించారు. ఆమె వెంట జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్యకిరణ్, తెలుగు దేశం పార్టీ సబ్ సీనియర్ నేత పర్వత సురేష్, ఎంపీడీవో గుత్తికొండ కిషోర్, కూటమి నాయకులు ఉన్నారు.

# జనసేన జండా మోస్తే దేశ ద్రోహంగానే భావించాలి..

**- భారత ఎన్నికల సంఘం తెలంగాణాలో ఎమ్ఐఎమ్ పార్టీని, ఎపిలో జనసేన జండాను రద్దు చేయాలి**
**- జనసేన జండా రూపం మత సామరస్యానికి ప్రమాదం కాదా ! : మేడా శ్రీనివాస్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** జనసేన జండా ను, అసదుద్దీన్ ఓవైసీ పార్టిని రద్దు చేసే దిశగా భారత ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (అర్పిసి) ప్రధాన కార్యాలయంలో జరిగిన పార్టి వారాంతపు సమావేశంలో అర్పిసి వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా మేడా మాట్లాడుతూ,భారత్ వంటి లౌకిక దేశంలో జనసేన జండా రూపం జీసెస్ క్రీస్తును అవమానించే విధంగా వుంటుందని , తద్వారా ఇతర మతాలలో వాగ్వివాదాలకు అవకాశంగా మరే ప్రమాద పరిస్థితులు వుంటాయన్నారు.జీసెస్ క్రీస్తుకు శిలువ వేసిన యూదు దేశానికి అతి దగ్గరగా ఉన్నటువంటి జనసేన జెండాను మత విద్వేషాలకు దారి తీసే కుట్ర పూరిత దురుద్దేశ్యంతోనే ఆ పార్టి రూప కల్పన చేసి నట్టుందన్నారు. ఆంధ్రప్రదేశ్ లో జనసేన జెండాను చూస్తున్నప్పుడు ఇజ్రాయిల్ యూదుల జెండానా ! అన్నట్టుగా కనపడుతుందన్నారు. ఏ రాజకీయ పార్టి జండాలో నైనా రాష్ట్ర అభిమానం, దేశభక్తి కనపడాలి.జనసేన జండా రూపం మాత్రం యూదు దేశపు ఇజ్రాయిల్ జెండా మూలాలు కనపడుతుంటాయి . అమాయకంగా జనసేన జెండా మోస్తున్న వారిలో జాతీయ భావలు ,దేశ సార్వభౌమాధికార గుర్తులు ఏ విధంగా కనపడతాయో ఆ పార్టిలో స్పృహ వున్న వారు చెప్పాలి . రాజకీయ పార్టిలు ఎన్నైనా ఉండొచ్చును ఆ పార్టి మూలాల్లో సామాజిక స్పృహతో బాటుగా దేశ భక్తి నర నరాన్న ఇమిడి ఉండాలి . జండా రూపకల్పంలో ఎన్నికల సంఘం ప్రమేయం పెద్దగా లేక పోయినప్పటికి సామాజిక భద్రతకు , దేశ సమగ్రతకు , మత సామరస్యానికి ముందు ముందు విఘాతం కలుగుతుంది అనే పరిస్థితులు ఉత్పన్నమౌతాయి అనుకుంటే నిఘా విభాగాలు ముందస్తుగా అంచనాలు వేసి కేంద్ర ప్రభుత్వానికి , కేంద్ర ఎన్నికల సంఘానికి ప్రత్యేక నివేదికలను సమర్పించి శాంతి భద్రతలను కాపాడే దిశగా పాలనా చర్యలకు సహకరించాలని ఆయన కోరారు. విదేశీ బావజాలం, ఉగ్రవాద ఉన్మాద సిద్ధాంతాలతో భారతదేశంలో రాజకీయ పార్టిలు నడపటంపై కేంద్ర ఎన్నికల సంఘం, కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రికరించలేక పోతుందని, ప్రక్షాళన దిశగా కేంద్ర నిఘా విభాగం చర్యలు చేపట్టాలి . తెలంగాణా రాష్ట్రం హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తున్న అసదుద్దీన్ ఓవైసిఎమ్ ఐఎమ్ పార్టి పని తీరులో భారతదేశ సార్వభౌమాధికారం, జాతీయ సమగ్రత కనీసం కనపడదనేది ఏ మాత్రం సందేహం లేదు. సందర్భం దొరికి నప్పుడల్లా ఆ పార్టి భారత్ పై వ్యతిరేకత వెళ్ళగక్కుతుంటుంది. భారతదేశ జాతీయ గీతం , జాతీయ జెండా, రాజ్యాంగం పై కూడా ఆ పార్టి విషం కక్కుతుంది. కొంతమంది పాకిస్తాన్ ఉగ్రవాద సానుభూతి పరులు నేరుగా పార్లమెంట్ లో సైతం భారత వ్యతిరేక ప్రసంగాలు చేస్తున్న రాజకీయ స్వప్రయోజనాల కోసం అలాంటి వారిపై చర్యలు చేపట్టటంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి . ఇజ్రాయిల్ యూదుల జెండా నమూనాతో జనసేన పార్టి ని స్థాపించిన పవన్ కళ్యాణ్ ఈ మధ్య అతను నటించిన ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలో ఒక సన్నివేశంలో అవసరం లేకున్నా పాతబస్తీ లోకి బొట్టు పెట్టుకుని రాకూడదని , అదే విధంగా డైరెక్టర్ కు ఇష్టం లేని రాజకీయ సన్నివేశాలు కొన్ని కల్పించరనే విమర్శలు పుంకాను పుంకాలుగా పుకార్లు షికార్లు చేస్తున్నాయి . నేను వచ్చింది పాతబస్తీనే పాకిస్తాన్ కాదు అనే సన్ని వేసాన్ని ఇమిడ్చి యూదు జెండా బావజాలాన్ని పవన్ కళ్యాణ్ నిరూపించుకుని భారత్ వంటి లౌకిక దేశంలో మత ఘర్షణలకు ఆజ్యం పోస్తున్నారు . ఒక ప్రక్క హిందువులను, మరో ప్రక్క క్రిష్టియన్స్ ను అంటు ప్రక్క దారిలో ముస్లిమ్స్‌లో మత సామరస్యాన్ని విచ్చిన్నం చేస్తున్నారు. పవన్ కళ్యాణ్ పార్టి జెండా స్వభావం మత ఘర్షణలను ప్రేరేపిస్తున్నారని ఆయన సూటిగా ఆరోపణ చేసారు. తెలంగాణాలో ఓవైసి, ఆంధ్రప్రదేశ్ లో పవన్ కళ్యాణ్ లు మతోన్మాద ఉన్మాదాలకు అగ్గి రాజేసి రాజకీయంగా సొంత లబ్ది పొందుతున్నారు. ఎమ్ ఐ ఎమ్ పార్టి మూలాలు రజాకార్ల క్రూరత్వం నుండి పురుడు పోసుకున్న ఖాసీం రజ్వి వారసత్వం నుండి ఉద్భవిస్తే పవన్ కళ్యాణ్ జనసేన పార్టి జీసెస్ క్రిస్ట్ ను అతి క్రూరంగా శిలువ వేయించిన యూదుల హృదయాల్లో నుండి జన్మించిన జనసేన జండా భవిష్యత్ సమాజానికి తీవ్ర ప్రమాదం అన్నారు. ఆంధ్రప్రదేశ్ - తెలంగాణా రాష్ట్రాల్లో కూడా నెమ్మిది నెమ్మిదిగా మతోన్మాద సమస్యలు లేవనెత్తే ప్రమాదాలు సంభవిస్తాయేమోననే ఆందోళనలు కలుగుతున్నాయన్నారు. ఈ సభకు అర్పిసి సీనియర్ సెక్యులర్ పెండ్యాల కామరాజు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో అర్పిసి సెక్యులర్స్ సర్వశ్రీ సిమ్మా దుర్గారావు,దుద్దే సురేష్ , వర్ధనపు శరత్ కుమార్ , గుడ్ల సాయి దుర్గా ప్రసాద్ , బసా సోనియా,మాసా సుభద్ర ,కందివలస రమణ, చల్లా శివ దుర్గాప్రసాద్ , కందివలస హైమావతి తదితరులు పాల్గొన్నారు.

# పీజీఆర్ఎస్ - మీకోసం రెవెన్యూ క్లినిక్ సోమవారం నిర్వహణ

**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

మార్చ్ 30వ తేదీ సోమవారం పీజీఆర్ఎస్ మీకోసం రెవెన్యూ క్లినిక్ యథావిధిగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కలెక్టరేట్ గోదావరి భవన్‌లో అలాగే డివిజన్, మండల కేంద్రాల్లో మీకోసం కార్యక్రమం, ప్రజా సమస్యల పరిష్కార వేదిక మరియు రెవెన్యూ క్లినిక్ నిర్వహించబడతాయని పేర్కొన్నారు. అర్జీదారులు తమ అర్జీలను "మీకోసం.ఏపీ.జీవోవి.ఇన్" వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని పరిష్కార మార్గాలను పొందవచ్చని తెలిపారు. అలాగే నమోదైన అర్జీల ప్రస్తుత స్థితి తదితర వివరాల కోసం 1100 టోల్ ఫ్రీ నంబర్‌కు నేరుగా కాల్ చేసి తెలుసుకోవచ్చని సూచించారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్ మరియు మండల స్థాయిలలో కూడా మీకోసం రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు యథావిధిగా నిర్వహించబడతాయని తెలిపారు. రెవెన్యూ డివిజన్ అధికారులు, నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు జిల్లా స్థాయిలో రెవెన్యూ క్లినిక్‌కు హాజరవుతారని పేర్కొన్నారు. తహశీల్దార్లు తమ ప్రధాన కార్యాలయాల నుంచి హాజరై ప్రజల అర్జీలను స్వీకరించి పరిష్కార చర్యలు చేపడతారని తెలిపారు.

ప్రజలకు మరింత మెరుగైన పౌర సేవలను 95523 00009 వాట్సాప్ నంబర్ ద్వారా కూడా అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

# రిటైర్డ్ డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ వి.శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు

**కరప మాజీ సర్పంచ్ తాతీలు**



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కరప గ్రామంలో కొన్ని కుటుంబాల పరిస్థితి ఇబ్బందిగా మారడంతో వాళ్ల ఇబ్బందులను గుర్తించి ప్రజా సేవకుడైన కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు వాళ్లకి ఏదైనా చేయాలనే సంకల్పంతో కాకినాడకు చెందిన రిటైర్డ్ డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ వి. శ్రీనివాస్ వాళ్ల కష్టాలను చూసి మానవత దృక్పథంతో తాపీలు అడిగిన వెంటనే వాళ్ల కుటుంబాలకు మొత్తం60 వేల రూపాయలుఅందించడం జరిగింది. అందుకున్న వాళ్ళ వివరాలు: కరప కొత్తపేటకి చెందిన1. పేపకాయల వెంకటరమణ దీర్ఘకాలిక వ్యాధితోబాధపడుతున్నాడు, అతనికి 10వేల రూపాయలు, 2. రామకంచిరాజు నగర్ కి చెందిన ఆకుల లక్ష్మీ పార్వతి ఇటీవల కాలం చేసారు,వాళ్ళ కుటుంబసభ్యులకు 5 వేలు. 3.ముగ్గుగన్నేమ్మ దీర్ఘకాలిక వ్యాధితో బాధ పడుతుంది, ఆమెకు5 వేలు 4.మొటూరి ఎల్లప్ప దీర్ఘకాలిక వ్యాధితోబాధపడుతున్నారు,వారికి 5 వేల రూపాయలు 5.శివాలయం వీదికి చెందిన పుట్టా అక్షితకు ఇటీవల వివాహం అయ్యింది(తల్లి తండ్రులు లేరు), ఆమెకు 15 వేల రూపాయలు,6..మెరక వీదికి చెందిన నల్లా సూరిబాబు ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నారు అతనికి5 వేల రూపాయలు. 8. కరప శివారు అగ్నికులక్షయత్రియ పేటకి చెందిన పట్టా విష్ణు ఇల్లు కాలిపోయింది,ఆయనకి 10 వేల రూపాయలను, 9. నక్కా వారి వీధికి చెందిన మాతా ఈశ్వరావు ఇటీవల కాలం చేసాడు,వాళ్ళ కుటుంబానికి 5 వేల రూపాయలనుఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో బయలుపాటి నూకరాజు పాల్గొన్నారు. అడిగిన వెంటనే నా గ్రామస్తులకు సహాయం చేసిన దాత వి.శ్రీనివాస్‌కు నా తరపున, బాధితుల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

# ఘనంగా టిడిపి పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు, సంక్షేమ పథకాలకు ఆద్యుడు నందమూరి తారకరామారావు ఆశయాలే నేటికీ తెలుగుదేశం పార్టీకి మార్గదర్శకాలని ఆ పార్టీ సీనియర్ నాయకులు కొనియాడారు. ఆదివారం కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని కరప, నడకుదురు, చీడిగ, స్వామి నగర్, ఇంద్రపాలెం తదితర గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పండగ వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు నులుకుర్తి వెంకటేశ్వరరావు, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు పార్టీ జెండాలను ఆవిష్కరించి, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నడకుదురులోని జనావళి వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి తమ సేవా గుణాన్ని చాటుకున్నారు. సినిమా రంగంలో మకుటం లేని మహారాజుగా వెలుగుతున్న సమయంలోనే, ఆ సంపదను, కీర్తిని పక్కన పెట్టి కేవలం తెలుగు జాతి అభ్యున్నతి కోసమే ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వచ్చారని నాయకులు గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే విప్లవాత్మక నిర్ణయాలతో సంక్షేమ రాజ్యానికి ఆయన పునాది వేశారని, అవినీతి రహిత సమాజం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా ఎన్టీఆర్ వేసిన బలమైన పునాది కారణంగానే పార్టీ నేటికీ చెక్కుచెదరకుండా ఉందని, ఆయన బాటలోనే నారా చంద్రబాబు నాయుడు పార్టీని సమర్థవంతంగా ముందుకు నడిపిస్తున్నారని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవు వెంకన్న, గీసాల వెంకటేశ్వరరావు, పితాని అప్పన్న, కొండ వినాయక్, కే సీతామాలక్ష్మి, కోనా వెంకటలక్ష్మి, మేడిశెట్టి అప్పల స్వామి, అనిశెట్టి గంగాధర్, కొండేపూడి పాండవులు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**గ్రామ కూడళ్ళలో రెపరెపలాడిన పసుపు జెండాలు - భారీగా హాజరైన కార్యకర్తలు**



**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** కాజులూరు మండల గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ 44వ టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, నాయకులు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరై పార్టీ పట్ల తమ నిబద్ధతను చాటుకున్నారు. ప్రతి గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించి, నాయకులు పార్టీ ఆశయాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మండల టీడీపీ అధ్యక్షుడు చావ్వాకుల నారాయణమూర్తి మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధి తెలుగుదేశం పార్టీ ద్వారానే సాధ్యమని పేర్కొన్నారు.తెలుగుదేశం పార్టీ స్థాపన నాటి నుండి సామాన్య ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి, వారి జీవితాల్లో మార్పు తీసుకువచ్చిందని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాజులూరు, తణుకువాడ, పెనుమళ్ళ, గొల్లపాలెం, కొలంక, దుగ్గుదూరు గ్రామాల్లో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కోటిపల్లి , సిరిపురం డి సీలు దాట్ల విజయ గోపాల రాజు, పేపకాయల బాబ్జి , కోలంక గ్రామ తెదేపా అధ్యక్షుడు దాట్ల బుచ్చిబాబు, క్లస్టర్ ఇంచార్జ్ వనుశీ వీరబ్రహ్మం , మండల తెదేపా ఉపాధ్యక్షుడు మేడిశెట్టి పెద్ద , జనసేన మండల అధ్యక్షుడు బొండా వెంకన్న, క్లస్టర్ ఇంచార్జ్ పలివెల రాజు, టీడీపీ నాయకులు వల్లు అర్జునరావు, పితాని సతీష్, కురుపూడి కొండ, తదితరులు పాల్గొన్నారు.

# వేళంగిలో ఘనంగా మట్టల ఆదివారం

**పెద్ద సంఖ్యలో పాల్గొన్న క్రైస్తవులు - హోసన్న నినాదాలతో మార్మోగిన వేళంగి**



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కరప మండలం వేళంగి గ్రామంలో ఉన్న రోమన్ క్యాథలిక్ మిషన్ ఆర్.సి.యం చర్చి ఫాదర్ ప్రభాకర్ ఆధ్వర్యంలో క్రైస్తవులు ఎంతో ముఖ్యమైన పండుగగా జరుపుకునే గుడ్ ఫ్రైడే, ఈస్టర్, పండుగ కు ముందు ఆనవాయితీగా జరుపుకునే మట్టల ఆదివారాన్ని వేళంగినీ మాత దేవాలయం క్రైస్తవులు గ్రామంలో ఊరేగింపుగా తిరిగి ఏసుక్రీస్తు పాటలతో, హోసన్న అనే నినాదాలతో ఎంతో ఘనంగా జరుపుకున్నారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. మట్టల ఆదివారం కథ క్రైస్తవ చరిత్రలో అత్యంత ముఖ్యమైన ఘటన. ఏసుక్రీస్తు తన శిలువ మరణానికి ముందు, ఎరుషలేము నగరంలోకి రాజుల ప్రవేశించిన సందర్భం. అంతకుముందు అనేకసార్లు ఏసుక్రీస్తు ఎరుషలేం పట్టణానికి వచ్చిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. కానీ క్రీస్తు రాక ఇదే లాస్ట్ కావడంతో ఆయన రాకకు ప్రత్యేకత సంతరించుకుంది. మట్టల ఆదివారం ఏసుక్రీస్తు రాజుగా లోక రక్షకుడుగా అంగీకరించే భక్తి పూర్వక రోజుగా క్రైస్తవులు జరుపుకుంటారు. క్రైస్తవ భాషలో హోసన్నా అంటే మమ్మల్ని విడిపించు అని అర్థం. చర్చిలో ఈ మట్టల ఆదివారం ప్రత్యేకతను గురించి ఫాదర్ ప్రభాకర్ క్రైస్తవ సోదరీమణులకు, సోదరులకు వివరంగా చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో చర్చి పెద్దలు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# అంగరంగ వైభవంగా వాడపల్లి వెంకన్న కళ్యాణ మహోత్సవం

**స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించిన రాష్ట్ర కార్మిక శాఖమంత్రి వాసంశెట్టి సుభాష్ - స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే బండారు దంపతులు - పోటెత్తిన భక్తజనం గోవింద నామస్మరణతో మార్మోగిన వాడపల్లి గ్రామం**



**ఆత్రేయపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఏడు శనివారాల వెంకన్న దర్శనం ఏడేడు జన్మల పుణ్యఫలం అనే నానుడితో, కోనసీమ తిరుమల గా ఈ ఆలయం అలరారుతుంది. విద్యుత్ దీపాల అలంకరణతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన కళ్యాణవేదిక వద్ద ప్రముఖ వేదపండితులు ఖండవల్లి రాజేశ్వరవర ప్రసాద్ ఆచార్యులు బ్రహ్మత్వంలో ఆలయ అర్చకులు కళ్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా కమనీయంగా నిర్వహించారు. స్వామి వారిని అమ్మవార్లను సుగంధద్రవ్యాలతో అలంకరించి పల్లకిలో వేదమంత్రాలు వివిధ సాంస్కృతి కార్యక్రమాలతో స్వామివారిని కళ్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చి రజిత సింహాసనంపై ఆశీనులను చేశారు, స్వామివారికి అర్చక బృందం విశ్వక్సేన పూజ, పుణ్యావచనం, కంకణ ధారణ, బ్రహ్మ ముడులు, కన్యాదానం, పాద ప్రక్షాళన, సూత్ర యజ్ఞోప వేదధారణ తలంబ్రాలు తదితర కార్యక్రమాలను వైభవోపేతంగా జరిపించారు. స్వామి అమ్మవార్లకు రాష్ట్ర కార్మిక శాఖమంత్రి వాసంశెట్టి సుభాష్, అంబేద్కర్ కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్ నిశాంతి దంపతులు, కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు దంపతులు, రాష్ట్ర బి.సి.కార్పోరేషన్ చైర్మన్ రెడ్డి అనంత కుమారి సుబ్రహ్మణ్యం, కొత్తపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్చార్జి బండారు శ్రీనివాసరావు, ఆలయ కమిటీ చైర్మన్, మండలి సభ్యులు, కార్యనిర్వహణాధికారి మరియు డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. వేలాదిమంది భక్తులు పాల్గొని కనులారా స్వామి వారి దివ్యకళ్యాణాన్ని తిలకించి పులకించారు. కళ్యాణ వేదిక సమీపంలో భక్తులు వెలిగించిన కర్పూర దీపాలు విశేషంగా ఆకట్టుకున్నాయి, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డిఎస్పి సుంకర మురళి మోహన్, సీఐ విద్యాసాగర్, ఎస్సై రాము ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# అమరావతి రాజధానికి చట్టబద్ధత

## పోరాడిన రైతుల త్యాగాలకు న్యాయం జరిగింది - ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర చరిత్రలో ఈ రోజు ఒక గోల్డెన్ డే అని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. అమరావతి రాజధాని కోసం ఎన్నో సంవత్సరాలు పోరాడిన రైతుల త్యాగాలకు గౌరవం దక్కే విధంగా కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో రెజల్యూషన్ పాస్ చేయడం చారిత్రాత్మక ఘట్టమని తెలిపారు. కేంద్రానికి పంపేందుకు అసెంబ్లీలో అమరావతి రాజధానికి చట్టబద్ధత తీర్మానం చేసి అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అసెంబ్లీలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీలో అమరావతి రాజధానికి చట్టబద్ధత కల్పించే రెజల్యూషన్ పాస్ కావడం రాష్ట్ర భవిష్యత్తుకు చాలా ముఖ్యమైన రోజు అని అన్నారు. దేవుడి రాతను ఎవరూ మార్చలేరు అన్నదానికి నిదర్శనంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అసెంబ్లీలో రెజల్యూషన్ పాస్ చేసిన సమయం (11 గంటల 11 నిమిషాలు) కూడా ప్రత్యేకంగా నిలిచిపోతుందని తెలిపారు. మహిళలు అమరావతి పాదయాత్ర సమయంలో రైతులు, ముఖ్యంగా మహిళలు ఎదుర్కొన్న ఇబ్బందులు, దాడులు ఎప్పటికీ మర్చిపోలేమని ఎమ్మెల్యే వాసు అన్నారు. రాజమహేంద్రవరంలో కూడా పాదయాత్ర సమయంలో ఉద్దేశపూర్వకంగా అప్పుడు అధికారంలో ఉన్న వైకాపా వారు దాడులు చేసి, డ్రైనేజ్ నీటిని బాటిళ్లలో నింపి విసరడం, ఐస్‌లా గట్టిపడిన వాటర్ ప్యాకెట్లను మహిళలపై విసరడం వంటి ఘటనలు జరిగాయని గుర్తు చేశారు. తర్వాత అదే వాళ్లు తిరిగి రైతులపైనే కేసులు పెట్టడం దురదృష్టకరమన్నారు. 2014-19 సమయంలో అమరావతి గురించి ఒకలా మాట్లాడి, అధికారంలోకి వచ్చిన తర్వాత వికేంద్రీకరణ పేరుతో అమరావతి మీద కక్ష సాధింపు రాజకీయాలు చేసిన విషయాన్ని ప్రజలు మర్చిపోలేదన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పుతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి అమరావతిని మళ్లీ గాడిలో పెట్టే పని చేస్తోందన్నారు. ఈ రోజు అసెంబ్లీలో ఉన్న 164 మంది ఎమ్మెల్యేలు చాలా అదృష్టవంతులమని, భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ రాజధానికి చట్టబద్ధత కల్పించిన అసెంబ్లీ సభ్యులుగా చరిత్రలో నిలిచిపోతామని అన్నారు. మొత్తం 175 మంది ఎమ్మెల్యేలు ఉన్నా, మిగిలిన వారు అసెంబ్లీకి రాకపోవడం ప్రజలు గమనించాలన్నారు. రాజధాని కోసం పోరాడిన ప్రతి రైతుకు, ముఖ్యంగా మహిళలకు ఎమ్మెల్యే వాసు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. చిన్న పిల్లలను ఎత్తుకుని ఎండలో నడిచిన మహిళల త్యాగాలు వృథా కాలేదని, వారి త్యాగాల ఫలితమే ఈ రోజు అమరావతికి చట్టబద్ధత రావడం అన్నారు. కొంతమంది రాజకీయ ప్రయోజనాల కోసం ఫేక్ ఎడిటింగ్స్ చేసి ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, ఎడిటింగ్స్ రాజకీయాలకు బ్రాండ్ అంబాసిడర్లుగా మారారని విమర్శించారు. ప్రతి విషయాన్ని రాజకీయంగా మార్చి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. ప్రజలకు న్యాయం చేయాల్సిన విషయాలను కూడా రాజకీయంగా వాడుకోవడం తగదన్నారు. రాష్ట్ర అభివృద్ధి, రాజధాని అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు ప్రజలు అండగా ఉండాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కోరారు.

# 14వ డివిజన్‌లో ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

## తెలుగు ప్రజల గుండెల్లో ఎన్టీఆర్‌ది సుస్థిరస్థానం - టీడీపీ సీనియర్ నాయకులు చెల్లుబోయిన సూర్యనారాయణమూర్తి







**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ ఎన్టీ రామారావు ది సుస్థిరస్థానమని 14వ డివిజన్ టీడీపీ సీనియర్ నాయకులు చెల్లుబోయిన సూర్యనారాయణమూర్తి అన్నారు. తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని 14వ డివిజన్‌లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. డివిజన్ ఇంచార్జ్ ఈతలపాటి రవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చెల్లుబోయిన సూర్యనారాయణమూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి వేడుకలను ప్రారంభించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. ముఖ్య అతిథి చెల్లుబోయిన సూర్యనారాయణమూర్తి మాట్లాడుతూ 44 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీ ప్రజల కోసం నిరంతరం పోరాడుతూ ప్రజల హృదయాలలో ప్రత్యేక స్థానం సంపాదించుకుందని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు అన్నీ వర్గాల ప్రజలు ఒకే వేదికపై చేరి ఈ వేడుకలను ఘనంగా నిర్వహించడం ఆనందకరమని తెలిపారు. రాజమహేంద్రవరం అభివృద్ధి కోసం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ నిరంతరం శ్రమిస్తూ, ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. పార్టీ సీనియర్ నాయకులు ఈతలపాటి కృష్ణ మాట్లాడుతూ ఒక ప్రాంతీయ పార్టీగా ప్రారంభమైన తెలుగుదేశం పార్టీ 44 సంవత్సరాలు పూర్తి చేసుకుని ప్రజల ఆశయాలను నెరవేర్చడం లో ముందంజలో ఉందన్నారు.ఎన్టీ రామారావు ఆశయాలు కూడు, గుడ్డ,నివాసం వంటి సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రతి పేదవానికి చేరువయ్యాయని గుర్తు చేశారు. అనంతరం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతూ అన్ని వర్గాల ప్రజలను ఐక్యంగా తీసుకెళ్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగిస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని సంకల్పం వ్యక్తం చేశారు. అనంతరం భారీ స్కూటర్ బైక్ ర్యాలీగా తిలక్ రోడ్డులోని నగర టీడీపీ కార్యాలయం వద్ద జరిగిన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బంగారు నాగేశ్వరరావు, ఉడమల నాగేశ్వరరావు, తొలేటి రాంప్రసాద్, డాన్ సూరి, ఎస్‌కె రబ్బానీ, మోర్సా సోమరాజు, మోర్సా శోభారాణి, ప్రతాప్, అబ్దుల్లా, కరణం లక్ష్మీ నాయుడు, దంగేటి అన్నవరం, తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీకి కార్యకర్తే బలం... కార్యకర్తే నాయకుడు

## - ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ - వేడుకగా టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు - భారీ ర్యాలీలుగా అశేషంగా తరలివచ్చిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీకి కార్యకర్తే బలం... కార్యకర్తే నాయకుడని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హితవుపలికారు. తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తిలక్ రోడ్డులోని నగర టీడీపీ కార్యాలయం వద్ద సంబరాలు జరిగాయి. టీడీపీ నగర అధ్యక్షులు మజ్జి రాంబాబు పర్యవేక్షణలో జరిగిన ఈ సంబరాల్లో భాగంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, ఏపీ శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యర్రా వేణుగోపాల రాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీ నవన్ కుమార్, సీనియర్ నాయకులు వర్రే శ్రీనివాసరావు,రెడ్డి మణేశ్వరరావు తదితరులతో కలిసి పార్టీ జెండాను ఎగురవేసి వ్యవస్థాపకులు ఎన్టీ రామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ రోజు మనందరికీ చాలా గర్వకారణమైన రోజన్నారు. తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పేందుకు, తెలుగు ప్రజల స్వాభిమానాన్ని కాపాడేందుకు స్థాపించబడిన మహత్తరమైన రాజకీయ శక్తి తెలుగుదేశం పార్టీ... 44 సంవత్సరాల ప్రయాణం అంటే ఇది సాధారణ విషయం కాదు... ఇది ఒక చరిత్ర, ఒక ఉద్యమం, ఒక భావజాలం, ఒక ప్రజా శక్తి అని ఉద్బోధించారు. సామాన్య ప్రజలకు, రైతులకు, పేదలకు, బలహీన వర్గాలకు రాజకీయాల్లో స్థానం కల్పించిన ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని అన్నారు. గ్రామీణ అభివృద్ధి, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, సంక్షేమం మరియు అభివృద్ధి రెండూ కలిసి నడవాలనే సిద్ధాంతంతో ఈ పార్టీ ముందుకు వచ్చిందన్నారు. గత ఐదేళ్లూ జగన్ పాలనలో ప్రజలు నరకయాతన పడ్డారని, ప్రజా సంక్షేమం కోసం, రాష్ట్రాభివృద్ధి కోసం చేసిన సంస్కరణలు శూన్యమన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలు ఊపిరి పీల్చుకుని నియంతపాల నుంచి బయటకు వచ్చినట్టు ఫీలవుతున్నారని అన్నారు. అలాగే గత 44 సంవత్సరాల టీడీపీ చరిత్రను చూస్తే ఎన్నో సంస్కరణలు, ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు, ఎన్నో సంక్షేమ పథకాలు ఈ పార్టీ ద్వారా ప్రజలకు అందాయయని, పేదవాడి ఇంట్లో దీపం వెలిగించాలని, రైతు పొలంలో నీరు రావాలని, యువకుడికి ఉద్యోగం రావాలని, మహిళకు గౌరవం రావాలని, రాష్ట్రం అభివృద్ధి చెందాలని ఎప్పుడూ ఆలోచించిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని అన్నారు. అభివృద్ధి కావాలి, ఉద్యోగాలు కావాలి, పరిశ్రమలు రావాలి, యువతకు భవిష్యత్తు ఉండాలి, రైతుకు గిట్టుబాటు ధర రావాలి, మహిళలు సురక్షితంగా ఉండాలి అని ప్రజలు కోరుకుంటున్నారని, ఈ ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చగల శక్తి తెలుగుదేశం పార్టీకే ఉందన్నారు. తెలుగుదేశం పార్టీ పుట్టింది ప్రజల కోసం, పెరిగింది కార్యకర్తల వల్ల, నడుస్తోంది ప్రజల ఆశీర్వాదంతో, ఇంకా ఎన్నో సంవత్సరాలు ప్రజలకు సేవ చేస్తూనే ఉంటుందన్నారు. కాగా సోషల్ మీడియా, మై టీడీపీ యాప్ ఇతర తెలుగుదేశం పార్టీ యాప్‌ల్లో చురుగ్గా ఉంటూ పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వం సంక్షేమ పథకాలను పోస్టింగ్‌లు చేస్తున్న పలువుర్ని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 3వ డివిజన్‌లో

# టిడిపి 44వ ఆవిర్భావ సంబరాలు

**- 3వ డివిజన్‌లో 300 మంది మహిళలకు చీరల పంపిణీ**

**- సీనియర్ మహిళా కార్యకర్తలకు ఘన సన్మానం**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాజమహేంద్రవరం సిటీలోని 3వ డివిజన్‌లో వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. పసుపు జెండాల రెపరెపలు, కార్యకర్తల కేరింతల మధ్య పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సత్తిబాబు పార్టీ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు.అనంతరం డివిజన్ పరిధిలోని 300 మంది పేద మహిళలకు చీరలు మరియు అల్పాహారాన్ని పంపిణీ చేశారు.అలాగే పార్టీకి ఎన్నో సంవత్సరాలుగా సేవలందిస్తున్న ఇద్దరు సీనియర్ మహిళా కార్యకర్తలను శాలువాలతో ఘనంగా సత్కరించి, వారికి రూ.1,000 నగదును, చీరలను అందజేశారు.

**పేదల సంక్షేమమే టీడీపీ లక్ష్యం: సత్తిబాబు**

ఈ సందర్భంగా కుడుపూడి సత్తిబాబు గారు మాట్లాడుతూ, స్వర్గీయ నందమూరి తారక రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీ 44వ వసంతంలోకి అడుగుపెట్టడం గర్వకారణమని అన్నారు. ఎన్టీఆర్ వేసిన బలమైన పునాదులపై, నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పార్టీ మహా వృక్షంలా ఎదిగిందని పేర్కొన్నారు.3వ డివిజన్‌లో కేవలం వేడుకలు మాత్రమే కాకుండా, సమాజంలోని నిరుపేదలకు అండగా ఉండాలనే ఉద్దేశంతోనే చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. పార్టీకి అండగా నిలిచే కార్యకర్తలే తమ బలం అని, ముఖ్యంగా సీనియర్ కార్యకర్తలను గౌరవించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని చెప్పారు. రాబోయే రోజుల్లో కూడా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో లోకేష్ సారథ్యంలో ప్రజా సమస్యలపై పోరాడుతూ, తెలుగుదేశం జెండాను మరింత ఎత్తుకు తీసుకెళ్తామని సత్తిబాబు స్పష్టం చేశారు.

# నీతి నిజాయితీల పాలనకు ఎన్టీఆర్ నిదర్శనం

**- సంక్షేమ పథకాలకు అధ్యుడు ఎన్టీఆర్**

**- తెలుగుజాతి అభ్యున్నతి కోసమే కోట్లది రూపాయల సంపదను విడిచిపెట్టారు**

**- గన్ని కృష్ణ ఆధ్వర్యంలో టీడీపీ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సంక్షేమ పథకాలకు ఆధ్యుడు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ అన్నారు.తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం శ్రీరామ నగర్ లోని వారి నివాసం వద్ద ఘనంగా నిర్వహించారు. తొలిత ఎన్టీఆర్ విగ్రహానికి గన్ని కృష్ణ, తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీ నవీన్ కుమార్, పందిరి మహాదేవుడు సత్రం చైర్మన్ రెడ్డి మణేశ్వరరావు,క్లస్టర్ ఇంచార్జ్ ఉప్పులూరి జానకి రామయ్య, ఇతర నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను జానకిరామయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గన్ని కృష్ణ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీని తెలుగుజాతి అభ్యున్నతి కోసం ఆనాడు నందమూరి తారక రామారావు ఏర్పాటు చేశారని చెప్పారు. అప్పటికే తెలుగు చలన చిత్ర రంగంలో మకుటం లేని మహారాజుగా రాణిస్తున్న ఆయన కోట్లాది రూపాయల సంపదను విడిచిపెట్టి తెలుగు జాతి కోసం రాజకీయ పార్టీని స్థాపించారని గుర్తు చేశారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే విప్లవాత్మకమైన నిర్ణయాలతో అద్భుతమైన సంక్షేమ పథకాలను ఏర్పాటు చేసి సంక్షేమ రాజ్యాన్ని నెలకొల్పారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ తంగెళ్ల బాబి,తెలుగుదేశం పార్టీ నాయకులు కంటిపూడి శ్రీనివాస్, జవ్వాది మురళీకృష్ణ, బొమ్మనమైన శ్రీనివాస్, పాలవలస వీరభద్రం, మర్రి దుర్గా శ్రీనివాస్,ఆర్యాపురం సత్యనారాయణ స్వామి దేవస్థానం చైర్మన్ మళ్ల వెంకట్ రాజు, ఆర్యాపురం అర్బన్ బ్యాంకు డైరెక్టర్ ఎం శ్రీనివాస్ (కాపు),తలారి ఉమాదేవి, తలారి భగవాన్, గొర్రెల రమణ,సంసాని ప్రసాద్,జక్కంపూడి అర్జున్,నల్లం ఆనంద్, కవులూరి వెంకట్రావు, ఉర్లంకల లోకేష్,రాయి అప్పన్న, వారాధి హనుమంతరావు,కాదా ఈశ్వరరావు, ఆనెం చంటి,బిజెపి ఆచారి, సింహాద్రి కోటిలింగేశ్వర రావు,వానపల్లి శ్రీనివాస రావు, గండేబత్తుల రామకృష్ణ, అప్పలరాజు, సింహాద్రి సతీష్,చించినాడ తాతాజీ, కెవి శ్రీనివాస్, బెనర్జీ, వారాది నాగబాబు,రొక్కం సత్యనారాయణ,రాజమంద్రపు శ్రీనివాస్, కొండబాబు, గొర్స అప్పలకొండ,పైలా రాంబాబు,ఎస్. ఎ.కరీం, మోత నాగలక్ష్మి, పాలవలస బ్రహ్మాజీ, కంచిపాటి గోవింద్, ఉమామహేశ్వరరావు, పైలా రాంబాబు, సింహాద్రి లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

# బంగారం ఇన్సూరెన్స్ కోసం పోలీసులనే బురిడీ కొట్టించిన లేడీ కిలాడి

**కోర్టు ఆదేశాలతో క్రమశిక్షణ చర్యలు : క్రైమ్ డీఎస్పీ సుభాష్**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** బంగారం ఇన్సూరెన్స్ కోసం ఒక లేడీ కిలాడి పోలీసుల్ని బురిడీ కొట్టించి సుమారు 30 లక్షల రూపాయలు విలువైన ఇన్సూరెన్స్ డబ్బులు కాజేయడానికి వేసిన పథకం బెడుసు కొట్టి ఆమె మెడకే ఉచ్చు తగులుకుంది. ఆదివారం కోరుకొండ పోలీస్ స్టేషన్లో క్రైమ్ డిఎస్పి సుభాష్ పాత్రికేయులతో మాట్లాడుతూ కోరుకొండ మండలం కాపవరం శివారులో నివాసం ఉంటున్న ముంద్రు పద్మ అనే మహిళ 26వ తేదీ రాత్రి గుర్తుతెలియని నలుగురు వ్యక్తులు ప్రవేశించి, తనను బంధించి సుమారు 200 గ్రాముల బంగారం దోచుకెళ్ళినట్లు ఫిర్యాదు ఇచ్చిందన్నారు. ఫిర్యాదు మేరకు 27వ తేదీ క్లూస్ టీం, జాగిలాల ఆధారంగా నాలుగు బృందాలు ఏర్పాటు చేసి, దర్యాప్తు ప్రారంభించామన్నారు. దర్యాప్తులో భాగంగా పద్మ ఇంట్లో సీసీ కెమెరా పుటేజీలు పరిశీలించి ఆమె విచారించగా అసలు దొంగ బయటపడిందన్నారు. బాధితురాలు పద్మ అర్ధరాత్రి పథకం ప్రకారం సీసీ కెమెరాల కేబుల్ కట్ చేసి, కెమెరాలకు క్లాత్ వేసి, సీసీ ఫుటేజ్ లో కవర్ అయ్యే విధంగా గదిలో వస్తువు చిందర వందరగా చేసిందన్నారు. ఆమె తాళ్లతో బంధించుకొని ఉదయం కేకలు వేయడం, మా సిబ్బంది చూసి పోలీసు ఉన్నతాధికారులకు తెలియజేశారన్నారు. డీఎస్పీ నరసింహకిషోర్ ఆదేశాల మేరకు దర్యాప్తు చేపట్టమన్నారు. తానే పథకం ప్రకారం బంగారం ఇన్సూరెన్స్ డబ్బులు పొందడానికి ఈ విధంగా ప్లాన్ చేసినట్లు అంగీకరించిందన్నారు. ఈమె పై గతంలో కోరుకొండ పోలీస్ స్టేషన్లో ఒక కేసు ఉందన్నారు. పథకం ప్రకారం పోలీసులను తప్పుదోవ పట్టించినందుకు కోర్టు ఆదేశాల మేరకు ఆమెపై క్రమశిక్షణ చర్యలు ఉంటాయన్నారు.ఈ కేసును త్వరగా చేదించిన సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణమూర్తి, ఎస్సై అంకారావు, సిబ్బందికి, ఎస్పీ నర్సింహకిషోర్ రివార్డు ప్రకటించారన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ డిఎస్పి రామకృష్ణ, సిఐలు బాలశౌరి, విజయబాబు, ఎస్సైలు అంకారావు, రామ్ కుమార్, పవన్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సినీ వాయిస్ CINEMA

# బట్టలు విప్పుకొని తిరిగితేనే స్వతంత్రమా?

## దివ్వెల మాధురి షాకింగ్ కామెంట్స్



ఆడవాళ్ల దుస్తుల విషయంపై రగడ ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. అప్పుడెప్పుడో నటుడు శివాజీ చేసిన కామెంట్స్ ను కొందరు వ్యతరేకిస్తే.. మరికొందరు సమర్థిస్తున్నారు. తాజాగా ఇదే వ్యవహారంపై బిగ్ బాస్ తెలుగు సీజన్ 9 కంటెస్టెంట్ దివ్వెల మాధురి ఆసక్తికర కామెంట్స్ చేసింది. బిగ్‌బాస్ తెలుగు సీజన్ 9లో వైల్డ్ కార్డ్ కంటెస్టెంట్ గా అడుగు పెట్టింది దివ్వెల మాధురి. హౌస్‌లో కేవలం మూడు వారాలు మాత్రమే ఉన్నాతన ఆట తీరు, మాటతీరుతో బిగ్ బాస్ ఆడియెన్స్ కు బాగానే చేరువైంది. 'ఫైర్ బ్రాండ్' ట్యాగ్ కు తగ్గట్టుగానే మొదట్లో తోటి కంటెస్టెంట్లతో గొడవలు పడిన ఆమె ఆ తర్వాత పూర్తిగా మారిపోయింది. బిగ్ బాస్ తనూజతో సహా తోటి కంటెస్టెంట్లందరి తోనూ స్నేహంగా మెలిగింది. కాగా బిగ్ బాస్ నుంచి బయటకు వచ్చిన దివ్వెల మాధురి వరుసగా ఇంటర్వ్యూలకు హాజరవుతోంది. తన పర్సనల్ అండ్ ప్రొఫెషనల్ లైఫ్ నకు సంబంధించి పలు ఆసక్తికర విషయాలు పంచుకుంటోంది. అలా తాజాగా ఓ టాక్ షోకు హాజరైన ఆమె మహిళల వస్త్రధారణ విషయంపై స్పందించింది. 'అమ్మాయిలకు డ్రెస్సింగ్ విషయంలో లిమిట్స్ ఉండాలి. ఈ విషయంలో నేను శివాజీ గారికి మద్దతు తెలుపుతూ ఒక వీడియో కూడా చేశాను. మనం వేసుకుని దుస్తులను బట్టి సమాజంలో లైంగిక దాడులు జరుగుతున్నాయా? అంటే నేను ఔనని చెప్పను. కానీ మనకంటూ సెక్యూరిటీ ఉండాలి. సౌకర్యంగా లేని బట్టలను వేసుకెళ్లి అందరూ చూస్తుండగా సర్దుకోవడం కంటే నిండుగా దుస్తులు వేసుకొని వెళ్లడం మంచిది. అమ్మాయిలకు అందం అనేది ఎక్స్ పోజింగ్ చేస్తే రాదు. ఒంటిపై నిండుగా బట్టలు వేసుకున్నప్పుడే అమ్మాయిలకు అందం రెట్టింపు అవుతుంది. మనం ఎప్పుడైతే నిండుగా దుస్తులు ధరిస్తామో అప్పుడే మనం బయటకు వెళ్లిన చాలా గౌరవం ఉంటుంది'అని చెప్పుకొచ్చింది. కాగా ఇటీవల ఒక ఇంటర్వ్యూలో వరలక్ష్మి శరత్ కుమార్ మాట్లాడుతూ.. ' మనం ఇంట్లో షార్ట్ వేసుకుంటే మన అన్నకు, నాన్నకు అలాంటి ఫీలింగ్స్ రావు కదా' కామెంట్స్ చేసింది. దీనిపై మీ ఒపీనియన్ ఏంటి? అన్న యాంకర్ ప్రశ్నకు దివ్వెల మాధురి ఇలా స్పందించింది. ' ఈ మధ్యకాలంలో ఎన్ని సందర్భాలలో మనం కూతురిపై తండ్రి లైంగిక దాడి, అన్న వల్ల గర్భవతి అయిన చెల్లెలు అనే వార్తలు వినలేదు. అలాంటి ఫీలింగ్స్ రానప్పుడు ఇలాంటి దారుణాలు ఎందుకు జరుగుతున్నాయి. బట్టలు విప్పి తిరిగితేనే స్వతంత్రం అనుకోవడం చాలా తప్పు. అమ్మాయిలు మీరు ఇండిపెండెంట్ గా ఎదిగితేనే మీకు స్వతంత్రం వచ్చినట్టు' అంటూ ఆన్సరిచ్చింది దివ్వెల మాధురి. ప్రస్తుతం ఈమె కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.

# యాంకర్ టూ హీరోయిన్..

## నెట్టింట పిచ్చెక్కిస్తున్న అందాల ముద్దుగుమ్మ..

టిక్ టాక్ వీడియోస్, ఇన్ స్టా రీల్స్ ద్వారా సోషల్ మీడియాలో విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకున్నవారు చాలా మంది ఉన్నారు. ఇదే ఫేమ్ తో అటు ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి సక్సెస్ అయ్యారు. అలాంటి వారిలో ఈ ముద్దుగుమ్మ ఒకరు. టిక్ టాక్ వీడియోలతో సందడి చేసింది. తర్వాత యాంకర్ గా బుల్లితెరపై అలరించింది. అలాగే హీరోయిన్ గా వెండితెరపై మెరిసింది. బుల్లితెరపై తనకంటూ మంచి క్రేజ్ సొంతం చేసుకుంది దీపికా పిల్లి. ఒకప్పుడు టిక్ టాక్ వీడియోస్ చేసి విపరీతమైన ఫాలోయింగ్ సంపాదించుకుంది. ఇక అదే ఫేమ్ తో బుల్లితెరపైకి అడుగుపెట్టింది. పలు షోలలో యాంకరింగ్ చేస్తూ అలరించింది. అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి సినిమా తర్వాత ఇండస్ట్రీలో దీపికా సైలెంట్ అయ్యింది. అటు బుల్లితెరపై కూడా కనిపించడం లేదు. తాజాగా ఈ అమ్మడు తన ఇన్ స్టాలో షేర్ చేసిన ఫోటోస్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. పింక్ కలర్ లెహంగాలో మరింత అందంగా కనిపిస్తుంది దీపికా. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మకు ఇన్ స్టాలో 2.1 మిలియన్ ఫాలోవర్స్ ఉన్నారంటే ఈ బ్యూటీకి ఏ స్థాయిలో క్రేజ్ ఉందో చెప్పక్కర్లేదు. ప్రస్తుతం ఈ అమ్మడు తెలుగులో సరైన అవకాశాల కోసం వెయిట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. తక్కువ సమయంలోనే తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ ముద్దుగుమ్మ.. ఇప్పుడు కథానాయికగా మారిన సంగతి తెలిసిందే. జబర్దస్త్, ఢీ షోలలో యాంకర్ గా మెరిసిన దీపికా.. ఆ తర్వాత వాంటెడ్ పండుగాడు సినిమాతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది. ఈ సినిమాతోపాటు యాంకర్ ప్రదీప్ మాచిరాజుతో కలిసి అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి సినిమాలోనూ నటించింది. అయితే ఈ రెండు చిత్రాలు పెద్దగా ఆడలేదు. అందం, అభినయంతో ప్రేక్షకుల హృదయాల్లో చోటు సంపాదించుకుంది. ఈ అమ్మడు నెట్టింట చాలా యాక్టివ్.



# వాంఖడేలో రోహిత్ ఉగ్రరూపం..

## ఐపీఎల్ కెరీర్‌లో 9 ఏళ్ల తర్వాత ఇలా..



ముంబై ఇండియన్స్ మాజీ కెప్టెన్, 'హిట్‌మ్యాన్' రోహిత్ శర్మ ఐపీఎల్ 2026లో ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో తన బ్యాటింగ్ పవర్‌తో స్టేడియాన్ని హోరెత్తించిన రోహిత్, కేవలం 23 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేసి తన కెరీర్‌లోనే అత్యంత వేగవంతమైన ఫిఫ్టీని నమోదు చేశారు. ఈ మెరుపు ఇన్నింగ్స్‌తో ఆయన పలు పాత రికార్డులను తిరగరాశాడు. ఐపీఎల్ చరిత్రలో రోహిత్ శర్మ ఎన్నో చిరస్మరణీయ ఇన్నింగ్స్‌లు ఆడినప్పటికీ, వేగవంతమైన అర్ధ సెంచరీ విషయంలో ఆయన 2015 నాటి రికార్డును ఇప్పటివరకు అధిగమించలేకపోయాడు. గతంలో ఈడెన్ గార్డెన్స్ వేదికగా చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో రోహిత్ 25 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. అది ఆయనకు ఇప్పటివరకు అత్యుత్తమ రికార్డుగా ఉండేది. అయితే, తాజా మ్యాచ్‌లో కేవలం 23 బంతుల్లోనే 50 పరుగుల మైలురాయిని చేరుకోవడం ద్వారా తొమ్మిదేళ్ల నాటి తన సొంత రికార్డును రోహిత్ బద్దలు కొట్టాడు. ప్రారంభం నుంచే దూకుడుగా ఆడిన ఆయన, కోల్‌కతా బౌలర్లపై నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడ్డాడు. ఈ తుఫాన్ ఇన్నింగ్స్‌తో రోహిత్ శర్మ ఐపీఎల్‌లో మరో అరుదైన ఘనతను అందుకున్నాడు. లీగ్ చరిత్రలో 50 సార్లు యాభైకి పైగా పరుగులు (50ం స్కోర్లు) చేసిన నాలుగో బ్యాటర్‌గా ఆయన నిలిచాడు. తద్వారా క్రికెట్ దిగ్గజాలైన విరాట్ కోహ్లీ, డేవిడ్ వార్నర్ వంటి వారి సరసన రోహిత్ చేరాడు. ఐపీఎల్‌లో అత్యధిక సార్లు 50 కంటే ఎక్కువ పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాను ఒకసారి పరిశీలిస్తే.. విరాట్ కోహ్లీ (72 సార్లు), డేవిడ్ వార్నర్ (66 సార్లు), శిఖర్ ధావన్ (53 సార్లు), రోహిత్ శర్మ (50 సార్లు), కేఎల్ రాహుల్ (45 సార్లు) ఉన్నారు. లక్ష్య ఛేదనలో లేదా భారీ స్కోరు సాధించడంలో రోహిత్ శర్మ పాత్ర ఎంత కీలకమో ఈ మ్యాచ్ మరోసారి నిరూపించింది. పవర్‌ప్లేలో ప్రత్యర్థి బౌలర్ల లయను దెబ్బతీయడంలో ఆయన చూపిన చొరవ ముంబై ఇండియన్స్‌కు కొండంత బలాన్ని ఇచ్చింది. కేవలం బౌండరీలకే పరిమితం కాకుండా, మైదానం నలుమూలలా క్లాసిక్ షాట్లతో అలరించిన రోహిత్ ఇన్నింగ్స్ ఈ సీజన్‌లోనే అత్యుత్తమమైనదిగా క్రీడా విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ఫామ్ చూస్తుంటే, ఈ సీజన్ ముగిసే సమయానికి రోహిత్ మరిన్ని రికార్డులను తన ఖాతాలో వేసుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. కోల్‌కతాపై ఆయనకు ఉన్న అద్భుతమైన రికార్డుకు ఈ ఫాస్టెస్ట్ ఫిఫ్టీ ఒక మకుటంలా చేరింది.

### కోల్‌కతాపై 'హిట్‌మ్యాన్' హవా.. ఐపీఎల్ హిస్టరీలోనే సరికొత్త రికార్డ్.. అదేంటంటే?

ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన పోరులో ముంబై ఇండియన్స్ దిగ్గజ బ్యాటర్ రోహిత్ శర్మ అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. ఈ మ్యాచ్‌లో కేవలం పది పరుగులు పూర్తి చేయడం ద్వారా, లీగ్ చరిత్రలోనే ఒకే జట్టుపై అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా రోహిత్ చరిత్ర సృష్టించారు. తద్వారా ఆస్ట్రేలియా ఆటగాడు డేవిడ్ వార్నర్ పేరిట ఉన్న రికార్డును ఆయన తుడిచిపెట్టారు.కోల్‌కతా నైట్ రైడర్స్ అంటే రోహిత్ శర్మకు ప్రత్యేకమైన అభిమానం. ఆ జట్టుపై పరుగులు సాధించడంలో ఆయన ఎప్పుడూ ముందుంటాడు. తాజా మ్యాచ్‌కు ముందు రోహిత్ ఖాతాలో కోల్‌కతాపై 1083 పరుగులు ఉన్నాయి. వార్నర్ రికార్డును బద్దలు కొట్టడానికి ఆయనకు కేవలం 11 పరుగులు అవసరమయ్యాయి. ఆదివారం జరిగిన ఉత్కంఠభరిత పోరులో రోహిత్ ఆ మైలురాయిని చేరుకుని, ఐపీఎల్ చరిత్రలో కోల్‌కతాపై అత్యధిక పరుగులు (1094ం) చేసిన మొదటి బ్యాటర్‌గా నిలిచారు. డేవిడ్ వార్నర్ (1093 పరుగులు) ఇప్పుడు రెండో స్థానానికి పడిపోయారు.కోల్‌కతాపై అద్భుతమైన గణాంకాలు.. నైట్ రైడర్స్‌తో ఇప్పటివరకు ఆడిన 36 మ్యాచ్‌ల్లో రోహిత్ శర్మ సగటు 38గా ఉండటం విశేషం. ఈ జట్టుపై ఆయన ఒక అద్భుతమైన శతకంతో పాటు ఆరు అర్ధ శతకాలు బాదారు. 127 స్ట్రైక్ రేటుతో పరుగులు సాధిస్తూ కోల్‌కతా బౌలర్లకు ఎప్పుడూ సవాలు విసురుతుంటారు. ఐపీఎల్ చరిత్రలో కోల్‌కతాపై వెయ్యికి పైగా పరుగులు చేసిన ముగ్గురు ఆటగాళ్లలో రోహిత్ ఒకరు కాగా, మిగిలిన ఇద్దరు డేవిడ్ వార్నర్, విరాట్ కోహ్లీ.

### అగ్రస్థానంలో నిలిచిన భారత వీరుడు..

కోల్‌కతాపై అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో ప్రస్తుతం రోహిత్ అగ్రస్థానంలో ఉండగా, ఆ తర్వాత వరుసగా డేవిడ్ వార్నర్, విరాట్ కోహ్లీ (1021), శిఖర్ ధావన్ (907), సురేష్ రైనా (829) ఉన్నారు. ఈ రికార్డు రోహిత్ శర్మలోని నిలకడను, ముఖ్యంగా కోల్‌కతా జట్టుపై ఆయనకున్న ఆధిపత్యాన్ని మరోసారి నిరూపించింది. ఈ అద్భుత ప్రదర్శనతో సామాజిక మాధ్యమాల్లో రోహిత్ అభిమానులు పండగ చేసుకుంటున్నారు. ఈ వ్యక్తిగత రికార్డుతో పాటు, ముంబై ఇండియన్స్ జట్టు కూడా ఈ సీజన్‌లో మంచి ఊపు మీద కనిపిస్తోంది. రోహిత్ అందించిన ఈ శుభారంభం జట్టు ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచింది. ముఖ్యంగా వాంఖడే స్టేడియం లేదా ఈడెన్ గార్డెన్స్.. వేదిక ఏదైనా కోల్‌కతాపై రోహిత్ బ్యాట్ ఝుళిపించడం ఖాయమని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

- భక్తి వాయిస్
- బిజినెస్ వాయిస్
- సినీ వాయిస్
- క్రైమ్ వాయిస్
- హెల్త్ వాయిస్
- కిసాన్ వాయిస్
- తీర్పు వాయిస్
- సక్సెస్ వాయిస్
- వనిత వాయిస్
- కిడ్స్ వాయిస్
- తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com